

ఆవుల కంటైనర్‌ను అడ్డుకున్న వీహెచ్‌పీ సభ్యులు

కళ్యాణదుర్గం రూరల్, మార్చి 24: గోవులు, పశువులను అక్రమంగా రవాణా చేస్తున్న కంటైనర్‌ను విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) సభ్యులు ఆదివారం పోలీసులతో కలిసి అడ్డుకున్నారు. ఇందులో 19 ఆవులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. గుండ్లపల్లి కేంద్రంగా కర్నాటక, తమిళనాడుకు వీటిని తరలిస్తున్నారన్న సమాచారంతో దాడులు చేసినట్లు పోలీసులు తెలిపారు. కంటైనర్‌ను పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.



కంట్రోల్ రూమ్‌లో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది

ఎన్నికల కోడ్ ఉల్లంఘన వ్యవహారాల్లో కఠినంగా వ్యవహరించాల్సిన జిల్లా అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా అధికార వైసీపీ అభ్యర్థులు, నాయకులు జిల్లా వ్యాప్తంగా ప్రచారాలు సాగిస్తున్నారు. వలంటీర్లు, డీలర్లు, ఉపాధి సిబ్బందిని వాడుకుంటూ ఓటర్లను ప్రలోభ పెడుతున్నారు. ఐకేపీ సిబ్బంది వైసీపీ అభ్యర్థుల తరపున బహిరంగంగా ప్రచారం చేస్తున్నారు. ఈ ఉల్లంఘనలపై ప్రతి రోజు ఆధారాలతో పత్రికల్లోనూ, టీవీల్లోనూ వస్తున్నా చర్యలు తీసుకోవడంలో అధికారులు ఉదాశీన వైఖరి అవలంభిస్తున్నారు. అందుకే జిల్లాలో ఎక్కడా కూడా వలంటీర్లు భయపడటంలేదు. యథేచ్ఛగా వైసీపీ అభ్యర్థుల తరపున ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారనే విమర్శలు వినవస్తున్నాయి.

- అనంతపురం టౌన్



యథేచ్ఛగా కోడ్ ఉల్లంఘిస్తున్న అధికార పార్టీ
ప్రచారంలో వలంటీర్లు, డీలర్లు, ఉద్యోగులు
ఆధారాలతో వెల్లడిస్తున్న పత్రికలు, టీవీలు
చర్యల విషయం బయటికి పొక్కనివ్వని అధికారులు
మీడియా అడిగితే ముక్తసరిగా సమాధానం

అంతా గుట్టుగా..!

ఎన్నికల సమాచారం వెల్లడించని అధికారులు



కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు

కలెక్టరేట్‌లో ఎన్నికల వ్యవహారాలను నిరంతరం పర్యవేక్షించడానికి జిల్లా స్థాయి కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. దీన్ని ఇటీవలే కలెక్టరు గౌతమి ప్రారంభించారు. ఇందులో సీ.విజిల్ యాప్ నుంచి వచ్చే ఫిర్యాదుల పరిశీలన యూనిట్, 1950 కాల్‌సెంటర్, ఫీల్డ్ మానటరింగ్ కమిటీ యూనిట్, కోడ్ అమలు పర్యవేక్షణ కమిటీ యూనిట్, పార్టీలు, అభ్యర్థుల ఖర్చు పర్యవేక్షించే కమిటీ యూనిట్, ప్రచారాలకు అనుమతి యూనిట్, ఎన్‌ఫోర్స్‌మెంట్, కమర్షియల్ టాక్స్ యూనిట్, రోడ్డు ట్రాన్స్‌పోర్టు కమిటీ, స్టాట్యూటరీ రిపోర్ట్ సెల్, ఐఅండ్ పీఆర్ విభాగాలను ఏర్పాటు చేశారు. జేసీ పర్యవేక్షణలో కమాండ్ కంట్రోల్‌రూమ్ పని చేస్తుంది. ఆయా విభాగాల పర్యవేక్షణ అధికారులుగా జడ్పీ సీఈఓ, వ్యవసాయ శాఖ జేడీ, కలెక్టరేట్ సూపరింటెండెంట్‌ను నియమించారు. ఆయా కమిటీలకు సంబంధించిన సమాచారం సేకరించడానికి 24గంటల పాటు అందుబాటులో కంప్యూటర్ ఆపరేటర్లు, ఇతర సిబ్బందిని ఏర్పాటు చేశామని కలెక్టరు తెలిపారు.




కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసిన కాన్ఫరెన్స్ హాల్

అలంకారప్రాయంగా కంట్రోల్ రూం

ఎంతో హంగూ ఆర్భాటాలతో కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్ అలంకార ప్రాయంగా మారిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీన్ని నిత్యం పర్యవేక్షించాల్సిన అధికారులు ఇటువైపు చూడటం లేదు. జిల్లాలో జరిగే ఘటనలపై రోజువారీగా ఈకంట్రోల్ రూమ్‌కు సమాచారం రావాలి. వాటిని ఇక్కడ నివేదికల రూపంలో రికార్డులలో నమోదు చేసుకోవాలి. దీంతో ప్రతిరోజు ఎక్కడ ఏమి జరిగింది? ఎవరు కోడ్ ఉల్లంఘించారు? సీ. విజిల్ యాప్‌కు ఎన్ని ఫిర్యాదులు వచ్చాయి? ఆర్ఓలు ఎవరెవరిపై చర్యలు తీసుకున్నారు? తదితర పూర్తి సమాచారం ఉంటుంది. కానీ ఇక్కడి అధికారులను జిల్లాలోని పరిస్థితులను అడిగితే ఎలాంటి సమాచారం చెప్పడం లేదు. చివరకు మీడియా విభాగాన్ని అడిగినా మాకు ఎలాంటి సమాచారం రావడంలేదని, ఎవరు చెప్పడం లేదని సమాధానమిస్తున్నారు. ఉన్నతాధికారులు మాత్రం కోడ్ ఉల్లంఘించేవారిపై నియోజకవర్గ స్థాయిలోనే ఆర్ఓలు చర్యలు తీసుకుంటున్నారని చెప్పి తప్పించుకుంటున్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించి ప్రచారాలు చేస్తున్న వలంటీర్లు, డీలర్లు, ఇతర సిబ్బంది గురించి ఫొటోలతో వార్తలు పత్రికలలో ప్రచురితమవు తున్నాయి. ఈక్రమంలో అక్కడక్కడ కొంతమందిపై చర్యలు తీసుకుంటు న్నారు. కానీ ఆవిషయం కూడా ఆర్ఓలు అధికారికంగా చెప్పడం లేదు. విలేకరులు అడిగితేనే అవును వారిపై చర్యలు తీసుకున్నాం. వీరిపై చర్యలు తీసుకున్నామని ముక్తసరిగా సమాధానమిస్తున్నారు. లేకపోతే ఆ సమాచారమే బయటకు రావడంలేదు.

వ్యవహారమంతా గుట్టుగా సాగుతుండటంతో కోడ్ ఉల్లఘించేవారిలో ఏమాత్రం భయం ఉండటం లేదు. దీంతో వారు అధికార పార్టీకి అండగా ఓటర్లను ప్రలోభ పెడుతున్నారు. అందుకే జిల్లా స్థాయిలో ఎవరెవరు కోడ్ ఉల్లంఘించారు? ఎలాంటి ఘటనలు జరిగాయి? వాటిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు? ఎందరిని సస్పెండ్ చేశారు వంటి సమాచారాన్ని జిల్లా ఉన్నతాధికారులు రోజువారీగా పత్రికలకు తెలియజేస్తే అందరికి సమాచారం వెళ్లి కొంత మేరకైనా కోడ్ ఉల్లంఘనలు తగ్గే అవకాశం ఉంటుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

తలొగ్గితే అధికారులకు తంటాలే...



ఎన్నికల కోడ్ అమలు, ఎన్నికల నిర్వహణ అధికార యంత్రాంగానికి కత్తిమీద సామే. ఎవరు ఎన్ని ఒత్తిళ్లు, ప్రలోభాలు పెట్టినా అధికారులు, ఉద్యోగులు మాత్రం ఎన్నికల నిబంధనలు తూ.చా. తప్పకుండా పాటించాల్సి ఉంటుంది. ఏదైనా తప్పు జరిగితే అప్పటికప్పుడు కొంచెం ఉపశమనం కలిగినా అవి ఉద్యోగం వదిలే వరకు వెంటాడుతూనే ఉంటాయి. ఇందుకు తిరుపతి ఉప ఎన్నికలే మంచి ఉదాహరణ. ఆ ఎన్నికల్లో అక్రమాలను నిరోధించలేకపోయారనే ఆరోపణలు ఇపుడు పెద్ద పెద్ద ఉన్నతాధికారుల మెడకు ఉరితాళ్లుగా మారాయి. కలెక్టరు, ఎస్పీ, డీఎస్పీ, సీఐ, ఆర్డీఓ స్థాయి అధికారులు సస్పెండ్ అయ్యారు. ఇపుడు జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో కూడా అధికార వైసీపీ గెలిచేందుకు అనేక అడ్డదారులు, అక్రమాలకు తెరలేపుతూ అధికారులను ప్రలోభ పెడుతోందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఆ ఉచ్చులో పడి అధికారులు ఎన్నికలలో అక్రమాలకు అండగా నిలిస్తే మాత్రం వేటు తప్పదని గత సంఘటలు చెబుతున్నాయి.

ప్రతి ఫిర్యాదును సీరియస్‌గా తీసుకుంటున్నాం

ఎన్నికల కోడ్ అమలుకు సంబంధించి ఎక్కడా రాజీపడటంలేదు. ప్రతి ఫిర్యాదును సీరియస్‌గా తీసుకుంటున్నాం. వచ్చిన ఫిర్యాదులను సంబంధిత అధికారులతో విచారిస్తున్నాం. వాస్తవమని తేలితే ఆ ఉద్యోగులు, వలంటీర్లపై చర్యలు తీసుకుంటున్నాం. నియోజకవర్గ స్థాయిలోనే చర్యలు తీసుకునే అధికారం ఆర్ఓలకు అప్పగించాం. ఎన్నికలకు సంబంధించిన ప్రతి సమాచారం జిల్లా కమాండ్ కంట్రోల్ రూమ్‌కు వస్తుంది. ఆ సమాచారం మేరకు ఇక్కడ నుంచి ప్రతి అంశంపై సమీక్షిస్తు తగిన ఆదేశాలు జారీ చేస్తున్నాం.



- గౌతమి, కలెక్టరు



గర్భిణీ అంజలి మృతదేహం

ప్లీజ్.. సహకరించండి!







రాప్తాడు, మార్చి 24: ఎన్నికల వేళ నియోజకవర్గంలో వైసీపీ అసమ్మతి నాయకులను బుజ్జగించడం, గ్రామాల్లో వైసీపీ నుంచి టీడీపీలోకి వలసలు ఆపడం రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి తలనొప్పిగా మారింది. ఎన్నికల షెడ్యూల్ వచ్చినా వైసీపీ నాయకులందరూ కలిసి రాకపోవడంతో పార్టీకి తీవ్ర నష్టం కలిగే అవకాశం ఉందని ఆయన ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలోనే నియోజకవర్గంలోని వైసీపీ అసమ్మతి నాయకులను బుజ్జగించి, ప్రచారానికి సిద్ధం చేసేందుకు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, అతడి సోదరులు సిద్ధమయ్యారు. ఇన్నాళ్లు పట్టించుకోని వారి ఇళ్లకు సైతం వెళుతున్నారు. అధికారంలో ఉన్నన్నాళ్లూ పట్టించుకోకుండా ఎన్నికల వేళ అసమ్మతి నాయకులను బతిమాలుతున్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక కొందరు సీనియర్, ప్రముఖ నాయకులను ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, అతని సోదరులు తీవ్ర నిర్లక్ష్యం చేశారు. కనీసం సరిగా మాట్లాడకపోవడం, కష్టకాలంలో పార్టీ కోసం పని చేసిన వారికి తగిన గుర్తింపు ఇవ్వకపోవడం వంటి కారణాల వల్ల వారంతా ఎమ్మెల్యేకి దూరం జరిగారు. ఇప్పుడు ఎన్నికల వేళ వారంతా గట్టిగా పని చేయకపోతే తనకు ఓటమి తప్పదని భావించిన ఎమ్మెల్యే తోపుదుర్తి , అతడి సోదరులు అసమ్మతి నాయకులను బతిమాలే పనిలో పడ్డారు. అయితే అధికారంలో ఉన్నప్పుడు మేము గుర్తుకు రాలేదు... ఎన్నికలు రాగానే గుర్తొచ్చామా అంటూ ఆ అసమ్మతి నాయకులు ఎమ్మెల్యేకు సమాధానం చెబుతున్నారు. గతం వదిలేయండి. ఇకమీదట అలా జరగకుండా చూసుకుంటాం. ఈ సారి పార్టీ కోసం పని చేయాలంటూ పదే పదే ఎమ్మెల్యే బతిమాలడటంతో సరే చేస్తాం అని ఎమ్మెల్యే ఎదుట మాట వరుసకు చెబుతున్నారు. కానీ అసమ్మతి నాయకులందరూ గత ఎన్నికల్లో మాదిరి పని చేసే పరిస్థితి లేదనే వైసీపీ నాయకులే చెబుతున్నారు.

అసమ్మతి నాయకులకు ఎమ్మెల్యే బుజ్జగింపు
అసంతుష్టుల ఇళ్లకు వెళుతున్న తోపుదుర్తి బ్రదర్స్
వైసీపీ గెలుపు కోసం పనిచేయాలని వేడుకోలు
ఇన్నాళ్లకు గుర్తొచ్చామా అని ప్రశ్నిస్తున్న వైనం
చురుగ్గా పనిచేసేందుకు ఆసక్తి చూపని కీలక నాయకులు

ఉదాహరణలు

- చెన్నేకొత్తపల్లి మండలం మాజీ జడ్పీటీసీ వన్నా హనుమంతరెడ్డి ఏడాది నుంచి స్తబ్ధుగా ఉన్నాడు. తనకు తగిన గుర్తింపు లేదనే కారణంతో పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. ఇటీవల ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డే స్వయంగా ఆయన ఇంటికి వెళ్లి బుజ్జగించారు.
- చెన్నేకొత్తపల్లి మండలం వెంకటాంపల్లికి చెందిన సీనియర్ నాయకుడు చిన్న ముత్యాల్‌రెడ్డి రెండేళ్ల నుంచి అసమ్మతితో ఉన్నారు. ఇటీవల ఎమ్మెల్యే సోదరుడు రాజశేఖర్‌రెడ్డి ఆయన ఇంటికి వెళ్లి మాట్లాడి బుజ్జగించారు.
- చెన్నేకొత్తపల్లి మండలం పులేటిపల్లి సర్పంచ్ భర్త బచ్చల భాస్కర్‌రెడ్డి తీవ్ర అసమ్మతితో ఉన్నాడు. కొన్ని కారణాల వలన దాదాపు రెండేళ్ల క్రితం భాస్కర్‌రెడ్డిని వైసీపీ నుంచి సస్పెండ్ చేశారు. ఇటీవల ఆ సస్పెన్షన్ ఎత్తేశారు. ఎమ్మెల్యే సోదరుడు రాజశేఖర్‌రెడ్డి ఇటీవలే భాస్కర్‌రెడ్డి ఇంటికి వెళ్లి బుజ్జగించారు. అయినా ఆయన ఈ ఎన్నికల్లో పార్టీ కోసం చురుగ్గా పని చేసేలా కనిపించడం లేదని వైసీపీ నాయకులే చెబుతున్నారు.
- కనగానపల్లి మాజీ జడ్పీటీసీ అంకే లక్ష్మన్న వైసీపీ అధికారంలోకి వచ్చిన ఏడాది నుంచే అసమ్మతితో ఉంటూ పార్టీకి దూరంగా ఉన్నారు. గత సర్పంచ్ ఎన్నికల్లో కనగానపల్లిలో ఎమ్మెల్యే బలపరచిన అభ్యర్థికి పోటీగా అంకే లక్ష్మన్న తన సామాజికవర్గానికి చెందిన మహిళను పోటీ చేయించి భారీ మెజార్టీతో గెలిపించారు. దీంతో అప్పటి నుంచి ఆయన పార్టీ కార్యక్రమాలకు మరింత దూరం జరిగారు. ప్రస్తుతం ఎన్నికల్లో ఆయన మద్దతు కోసం ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి ఐదు రోజుల కిందట అంకే లక్ష్మన్న ఇంటి వద్దకు వెళ్లి కలిసి మాట్లాడారు.
- కనగానపల్లి మాజీ జడ్పీటీసీ ఈశ్వరయ్య దాదాపు మూడేళ్ల నుంచి కొన్ని కారణాల వల్ల పార్టీకి దూరంగా ఉన్నారు. ఈశ్వరయ్యను కలిసేందుకు ఎమ్మెల్యే ప్రయత్నిస్తున్నారు.
- అనంతపురం రూరల్ మండలంలోని వైసీపీ నాయకుడు బోనగిరి వరప్రసాద్‌రెడ్డి దాదాపు మూడేళ్ల నుంచి పార్టీకి దూరంగా ఉంటూ తీవ్ర అసమ్మతిలో ఉన్నారు. స్వయంగా ఎమ్మెల్యేనే వరప్రసాద్‌రెడ్డి ఇంటికి వెళ్లి కలిసి పార్టీ కోసం పనిచేయాలని అడిగారు.

ఆగని వలసలు

రాప్తాడు నియోజకవర్గంలో వైసీపీ నుంచి టీడీపీలోకి వలసలు కొనసాగుతున్నాయి. వీటిని ఆపేందుకు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, అతడి సోదరులు ఎంత ప్రయత్నించినా సాధ్యం కావడం లేదు. గత ఆరు నెలల నుంచి వైసీపీ నాయకుల వలసలు తీవ్రమయ్యాయి. వందలాది కుటుంబాలు మాజీ మంత్రి పరిటాల సునీత సమక్షంలో టీడీపీలోకి చేరుతున్నారు. రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారు కూడా ఎక్కువగా టీడీపీలోకి చేరుతున్నారు. అనంతపురం రూరల్, ఆత్మకూరు, రాప్తాడు, కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి, రామగిరి మండలాల నుంచి భారీగా టీడీపీలోకి చేరుతున్నారు. వైసీపీ నాయకులు పట్టించుకోకపోవడం, కష్టపడిన వారికి గుర్తింపు లేకపోవడం, తదితర కారణాల వలన టీడీపీలోకి చేరుతున్నామని వారంతా చెబుతున్నారు. పార్టీ మారొద్దు అని ఎమ్మెల్యే, అతడి సోదరులు చెబుతున్నా టీడీపీలోకి వలసలు ఆగడం లేదు.



కారుణ్యమూర్తి పాదాల చెంత

అమ్మ మరణం

అనాథలుగా మారిన చిన్నారులు

ఆడే పాడే వయసులో
లోకం పోకడ తెలియని ఆమె
అమాయకంగా ఓ వ్యక్తికి మనసిచ్చింది.
మనువాడింది. ముగ్గురు బిడ్డల తల్లైంది.
మరో బిడ్డ ఆమె కడుపులో ప్రాణం పోసుకుంటోంది.
సంసారం సజావుగా సాగుతున్న వేళ ..
కట్టుకున్న వాడు మద్యానికి బానిసయ్యాడు.
భార్యాబిడ్డలను వదిలేశాడు.
కలల కాపురం కన్నీటి పాలైంది.
రోడ్డే జీవన సౌధం అయ్యింది.
ఆదరించేవారు లేక.. బిడ్డల ఆకలి తీర్చడానికి
అన్నం కోసం భిక్షమెత్తింది.
ఆమె ఆకలి ఆరాటాన్ని దూరం చేయాలనుకుందో!
జీవన పోరాటానికి శాశ్వత విశ్రాంతి నివ్వాలనుకుందో!
మృత్యువు ఆమెను బైక్ రూపంలో ఢీకొట్టింది.
బయటికి కనిపించని గాయాలతో బాధపడుతున్న ఆమె
కంటికి కనిపిస్తున్న మరణదేవత నుంచి
తనను కాపాడమన్నట్లుగానో..
తన బిడ్డలకు నీ సంస్థే దిక్కన్నట్లుగానో..
కారుణ్యమూర్తి ఫాదర్ ఫెర్రర్ విగ్రహం వద్దకు చేరింది.
కనికరం లేని కాలపాశానికి చిక్కేలోగా కడసారి
ఓసారి చూడమని, ఆకలిబాధ తీర్చమని కట్టుకున్నవాడికి
అర్ధరాత్రి సమయంలో ఫోన్ చేసింది.
తనది వృథా ప్రయాసేనని కుమిలిపోతూ
పేగుతెంచుకు పుట్టిన పిల్లలను అనాథలను చేస్తూ
కడుపులో బిడ్డ సహా
తెల్లవారుజామున కన్నుమూసింది.

ఈ సంఘటన జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట ఆదివారం జరిగింది.

అనంతపురం కల్చరల్, మార్చి 24: భర్త ఆదరణకు దూరమై తన ముగ్గురు పిల్లలతో రోడ్డుపైనే జీవనం సాగిస్తున్న 4 నెలల గర్భిణి అంజలి(29) ఆదివారం తెల్లవారుజామున కలెక్టరేట్ ఎదుట ఉన్న ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ విగ్రహం వద్ద మృతి చెందింది. నగరానికి చెందిన బోయ రాజు అనే వ్యక్తి 13 సంవత్సరాల వయసులో ఉన్న అంజలిని ప్రేమించి వివాహం చేసుకున్నాడు. కొద్దిరోజులపాటు వీరి కాపురం సజావుగానే సాగింది. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఒక కొడుకు ఉండగా ప్రస్తుతం అంజలి 4 నెలల గర్భంతో ఉంది. అయితే మద్యానికి బానిసైన బోయ రాజు పిల్లలు సహా అంజలిని 3 నెలల కిందట వదిలేశాడు. దీంతో అంజలి తన ముగ్గురు పిల్లలతో కలెక్టరేట్ ఎదురుగా ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ విగ్రహం వద్దనే భిక్షాటన చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. శనివారం రోడ్డు దాటుకుంటున్న క్రమంలో చెరువుకట్టవైపు వెళ్తున్న ఓ ద్విచక్రవాహనదారుడు అంజలిని ఢీకొనగా ఆమె కింద పడిపోయింది. తర్వాత నెమ్మదిగా నడుచుకుంటూ ఫెర్రర్ విగ్రహం వద్దకు చేరుకుంది. అర్ధరాత్రి 2 గంటల ప్రాంతంలో వేరొకరి ఫోన్ ద్వారా భర్తకు ఫోన్ చేసి తనను బైక్ గుద్దిందని, ఆకలిగా ఉందని చెప్పినా భర్త పట్టించుకోలేదు. ఆదివారం తెల్లవారుజామున అంజలి తుదిశ్వాస విడిచింది. దీంతో ఇప్పటికే తండ్రి ప్రేమకు దూరమైన చిన్నారులు ఇపుడు తల్లిని కూడా కోల్పోవడంతో అనాథలుగా మారారు. అంజలి అంతిమ సంస్కారాలకోసం స్థానికులు, నగర పాలకసంస్థ అధికారులు సాయి ట్రస్టును సంప్రదించారు. ఆ ట్రస్టు అధ్యక్షుడు విజయసాయికుమార్ బృందం అక్కడికి చేరుకుని, జేఎన్‌టీయూ రోడ్డులోని వైకుంఠం ఘాట్‌కు అంజలి భౌతికకాయాన్ని తరలించి అంతిమ సంస్కారాలు నిర్వహించారు. కాగా అనాథలుగా మారిన చిన్నారుల పట్ల జిల్లా కలెక్టర్ చొరవ చూపి, ఏదైనా హాస్టల్‌లో ఆశ్రయం కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.



తల్లి మృతదేహం వద్ద చిన్నారులు

గెలిపించండి.. మీ సమస్యలు పరిష్కరిస్తా

పెన్షనర్ల సంఘం నాయకులకు చంద్రబాబు హామీ

టీడీపీ అధినేతను కలిసిన పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దనగౌడ్

అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి 24: 'టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి గెలుపునకు కృషి చేయండి. పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా' అని టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు హామీ ఇచ్చినట్లు పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దనగౌడ్ తెలిపారు. తమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బరాయన్‌తో కలిసి ఆదివారం మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో చంద్రబాబునాయుడును కలిసినట్లు తెలిపారు. రాష్ట్రంలో పెన్షనర్లు పడుతున్న ఇబ్బందులు, సమస్యలపై చంద్రబాబుకు వినతి పత్రం అందజేశామన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబునాయుడు మాట్లాడుతూ తాను అధికారంలోకి వచ్చిన వెంటనే పెన్షనర్లతో చర్చించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని తమకు చెప్పారని పెద్దనగౌడ్ పేర్కొన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో సీనియర్ సిటిజన్స్, పెన్షనర్లు కూటమికి సహకరించాలని కోరినట్లు పెద్దనగౌడ్ తెలిపారు. చంద్రబాబునాయుడుని కలిసిన వారిలో పెన్షనర్ల సంఘం నాయకులు మున్నెయ, నాగభూషణం, మూర్తి, రవీంద్ర, వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.



చంద్రబాబును కలిసిన పెద్దనగౌడ్, పెన్షనర్లు



ప్రజాగళం సభ స్థల పరిశీలన

బుక్కరాయసముద్రం, మార్చి24: శింగనమల నియోజకవర్గంలో ఈ నెల 28న టీడీపీ అధినేత చంద్రబాబు నిర్వహించనున్న ప్రజాగళం సభకు ఆదివారం బుక్కరాయసముద్రంలో స్థలాన్ని ఆ పార్టీ నాయకులు పరిశీలించారు. ప్రజాగళం రాష్ట్ర కోఆర్డినేటర్ రాజశేఖర్‌బాబు, ద్విసభ్యకమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని నాగభూషణం, జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు పసుపుల హనుమంతురెడ్డి, జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి పర్వతనేని శ్రీధర్ బాబు, కన్వీనర్ అశోక్ సభావేదిక స్థలంను పరిశీలించారు. బుక్కరాయసముద్రం పరిధిలోని తాడిపత్రి రోడ్డులో 220 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పక్కన ఉన్న స్థలాన్ని వేదిక కోసం ఎంపిక చేశారు. ఈనెల 28న రాప్తాడు నియోజకవర్గం పర్యటన అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు బుక్కరాయసముద్రంలో సమావేశం ఉంటుందని టీడీపీ నేతలు తెలిపారు.



బుక్కరాయసముద్రంలో సభా స్థలాన్ని పరిశీలిస్తున్న ప్రజాగళం ప్రోగ్రాం కోఆర్డినేటర్ రాజశేఖర్, ద్విసభ్యకమిటీ సభ్యులు

ఉష్ణోగ్రతలు (ఆది)

గరిష్ఠం : 40.0
కనిష్ఠం : 26.0



ఇఫ్తార్	సోమవారం సాయంత్రం	06:33
సెహరీ	మంగళవారం ఉదయం	05:03

నేత్రపర్వం

వైభవంగా శారదా పరమేశ్వరి విగ్రహ ప్రతిష్ఠ

అనంతపురం కల్చరల్, మార్చి 24: జిల్లాకేంద్రంలోని శారదానగర్ శంకరమఠంలో ఆదివారం శారదా పరమేశ్వరి పంచలోహ విగ్రహప్రతిష్ఠ, మహాకుంభాభిషేక వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో శాంతిహోమాలు నిర్వహించి, గర్భాలయంలో యంత్రప్రతిష్ఠ, శారదా పరమేశ్వరి పంచలోహ విగ్రహ ప్రాణప్రతిష్ఠ చేశారు. ఈ కార్యక్రమాన్ని వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ శృంగేరి శంకరమఠం ఉత్తరాధికారి విధుశేఖర భారతి స్వామి సమక్షంలో శాస్త్రబద్ధంగా నిర్వహించారు. అనంతరం ఆలయ గోపురంపై స్వామీజి చేతులమీదుగా మహాకుంభాభిషేకం చేశారు. తదనంతరం ఆలయ ఆవరణలో విధుశేఖర భారతి స్వామి భక్తులకు ఫలప్రసాద వితరణ చేశారు. ఈనెల 22వ తేదీ నుంచి నిర్వహిస్తున్న వేడుకలు ఆదివారం సాయంత్రం ముగిశాయి.





ఆలయానికి వస్తున్న విధుశేఖర భారతి స్వామి, స్వామీజీ దర్శనానికి వేచివున్న భక్తులు



ప్రతిష్ఠానంతరం ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న శారదాపరమేశ్వరి మాత



స్కూళ్లలో యాప్స్ భారం...

ఇక ఉపాధ్యాయులపై మరో భారం..పలు రకాల యాప్స్. వైసీపీ ప్రభుత్వం అనేక రకాల యాప్స్ పేరుతో ఉపాధ్యాయులపై భారం మోపింది. టాయిలెట్స్‌లోకి వెళ్లి నిత్యం క్లీన్‌గా ఉన్నాయో లేదో చూసి ఫొటోలు అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. గురువులు ఈ అంశాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. అదేవిధంగా మధ్యాహ్న భోజనం తయారీ సమయంలో...వంటలు వండటానికి ముందు...అన్ని పాత్రలను ఫొటోలు తీసి అప్‌లోడ్ చేయాలి. తర్వాత వంటలు వండిన తర్వాత కూడా ఫొటోలు తీసి అప్‌లోడ్ చేయాలి. అదేవిధంగా విద్యార్థుల అటెండెన్స్ యాప్‌తోపాటు, పలు ఆన్‌లైన్ యాప్స్ పెట్టి...వాటిలో నిత్యం సమాచారం ఇవ్వాలంటూ...వేధించడంపై ఉపాధ్యాయులు భగ్గుమంటున్నారు. ఇదెక్కడి ప్రభుత్వం అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వచ్చినప్పటి నుంచి గురువులను టార్గెట్ చేస్తూ...అనేక ఇబ్బందులకు గురి చేస్తుండటంపై టీచర్లు ఆగ్రహంతో ఉన్నారు. నాడు-నేడు పనులు అంటూ... కరోనా సమయంలో కూడా పనులు చేయించారు. ఈక్రమంలో కొందరు ఉపాధ్యాయులు మృత్యువాత కూడా పడ్డారు. ఇలా చెప్పుకుంటూ...పోతే...అనేక అంశాల్లో టీచర్లను టార్గెట్ చేస్తూ రావడంపై ఆయా వర్గాలు మండిపడుతున్నారు. ప్రస్తుతం ఎన్నికలు రావడంతో తమ సత్తా ఏంటో చూపిస్తాం అంటూ బహిరంగంగానే ప్రకటిస్తున్నారు.





గురువులపైనే గురి..!

- వైసీపీ సర్కారులో 'టార్గెట్ టీచర్స్'
- ప్రభుత్వం వచ్చీరాగానే.. వేధింపులు
- పలురకాల యాప్స్‌తో పనిభారం
- టాయిలెట్స్ క్లీనింగ్ నుంచి ఎండీఎం ఫొటోల వరకూ..
- ఎన్నికల వేళ తామేంటో చూపిస్తామంటున్న టీచర్లు

అనంతపురం విద్య, మార్చి 24 : వైసీపీ ప్రభుత్వం గురువులపైనే 'గురి' పెట్టినట్లుంది..ఏ మాత్రం అవకాశం దొరికినా వారిని వదలిపెట్టకుండా ముప్పు తిప్పలు పెడుతోంది. ఒకప్పుడు బడిపంతులు ఉద్యోగం అంటే ఉదయం వెళ్లి లంచ్‌బాక్స్‌తో వెళ్లి...బడిలో నాలుగు పాఠాలు చెప్పి.... చల్లగా సాయంత్రం ఇంటికి వచ్చేఉద్యోగం అనేవాళ్లు. పల్లెల్లో , పెద్దల్లో అయ్యవార్లు అంటే గౌరవం, పిల్లల్లో గురువుల పట్ల భక్తి, భయం ఉండేది. ప్రతి నెలా 1వ తేదీనే జీతం చెతికి అందేది. కానీ ఈ ఐదేళ్లలో సీన్ మారింది. వైసీపీ ప్రభుత్వం టోటల్ సీన్‌ను రివర్స్ చేశారని ఉపాధ్యాయ వర్గాలే వాపోతున్నాయి. ప్రతినెలా 10వ తేదీ, 12వ తేదీ వచ్చినా జీతాలు ఎప్పుడు వేస్తారో తెలియని అయోమయం. మరోవైపు ఫేషియల్ యాప్ పేరుతో ఉదయమే పరుగులు.. ఇంకో వైపు, టీచర్లు అంటేనే...అదేదో బూతు పదం అన్నట్లు వైసీపీ పెయిడ్ బ్యాచ్ ట్రోలింగ్స్ నడుమ టీచర్లు అనేక అభద్రతకు, అసహనానికి గురయ్యే పరిస్థితులు చూస్తున్నామని టీచర్లు మండిపడుతున్నారు. ఎన్నికల తరుణం వచ్చిందని.. టీచర్లపై ఈ ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం పెట్టిన అనేక ఆంక్షలు, షరతులపై మండిపడుతూ....తామేంటో చూపిస్తామంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

జీతాలపై కక్షపూరిత ధోరణి: లింగమయ్య, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి



ప్రభుత్వం.. ఉపాధ్యాయులపై కక్షపూరితంగా 1వ తేదీనే జీతాలు చెల్లించకుండా అనేక ఆర్థిక ఇబ్బందులకు గురి చేస్తోంది. బ్యాంకుల్లో అనేక అవసరాల కోసం రుణాలు తీసుకున్న గురువులు సకాలంలో బ్యాంకుల్లో ఇన్‌స్టాల్ మెంట్స్ చెల్లించక లేక అదనపు వడ్డీలు కట్టేందుకు అవస్థలు పడ్డారు. అప్పులకు సకాలంలో వాయిదాలు చెల్లించలేక అపవాదను మూటగట్టుకున్నారు. ఈ పరిస్థితిని ప్రభుత్వమే కల్పించింది. దీనికి ఈ ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోవాల్సిన సమయం వచ్చింది.

యాప్స్‌తో బోధనపై ప్రభావం: హరికృష్ణ, ఎన్టీఏ రాష్ట్ర అధ్యక్షుడు



ఉన్నతాధికారులు స్కూళ్లలో సెల్‌ఫోన్లు వినియోగించకూడదు అంటూనే...అనేక యాప్స్ తీసుకొచ్చారు. ఈ యాప్స్ వల్ల బోధనకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. 11వ పీఆర్సీలో అరియర్స్ డీఏ అరియర్స్ రావాల్సి ఉంది. మెడికల్ బిల్స్, సరెండర్ బిల్స్ కూడా భారీగా పెండింగ్‌లో ఉంచి, ఉపాధ్యాయులను, ఉద్యోగులను ఇబ్బందులకు గురి చేశారు. 117 జీవోను తీసుకొచ్చి విద్యారంగాన్ని, ఉపాధ్యాయులను మానసిక ఒత్తిడికి గురిచేశారు.

పర్యవేక్షణ పేరుతో అవమానం: అశోక్ కుమార్, ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు



విద్యాశాఖ ఉన్నతాధికారులు స్కూళ్లలో పర్యవేక్షణ పేరుతో టీచర్లపై ఒత్తిడి పెంచారు. విద్యార్థుల అటెండెన్స్, గుడ్లు, చిక్కీలు, భోజనం ఫొటోలు అప్‌లోడ్ చేయడం వల్ల ఇటు బోధన కుంటుపడుతుంది. సకాంలో మెటీరియల్ ఇవ్వకుండానే....నాడు-నేడు పనులు పూర్తి చేయాలంటూ మరో వైపు టీచర్లపై ఒత్తిడి చేయడం, స్కూళ్లలో బోధనా సమయాల్లో టీచర్లకు ఆన్‌లైన్ ట్రైనింగ్స్ పెట్టడం, పర్యవేక్షణ పేరుతో టీచర్లను అవమానపర్చడం హేయం. అశాస్త్రీయ విధానాలు, నిర్ణయాల వల్ల టీచర్లు అనేక అవస్థలు పడ్డారు.

ఫేషియల్ యాప్ తొలి ప్రయోగం..

జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ, ఎయిడెడ్, జడ్పీ, ఎంపీపీ,ఇతర ప్రభుత్వ రంగ స్కూళ్లు 1694 వరకూ ఉన్నాయి. ఇందులో ప్రైమరీ 1186 స్కూళ్లు, అప్పర్‌ప్రైమరీ 219 స్కూళ్లు, హైస్కూల్ 293 స్కూళ్లు ఉన్నాయి. వీటి పరిధిలో సుమారు 1,99,912 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీటి పరిధిలో టీచర్లు సుమారు 8,643 మంది వరకూ పనిచేస్తున్నారు. అయితే వైసీపీ ప్రభుత్వం టీచర్లపై ఫేషియల్ యాప్ పేరుతో ప్రయోగానికి దిగింది. ఉదయం, సాయంత్రం స్కూళ్లలో తమ సెల్‌ఫోన్లలోనే అటెండెన్స్ వేయాలంటూ... .కొత్త నిబంధన పెట్టింది. హాజరు వేసేందుకు ప్రభుత్వం ఎలాంటి డిజిటల్ పరికరాలు ఇవ్వకుండానే.... ఉపాధ్యాయులను వాళ్ల సెల్‌ఫోన్లే వాడాలని ఒత్తిడి తెచ్చింది. నెట్ వర్క్ పని చేయక..సమయానికి పాఠశాలకు వచ్చినా అటెండెన్స్ పడక..పాపం తీవ్ర ఆవేదనకు లోనయ్యారు. ఉపాధ్యాయ సంఘాల నేతలు, నాయకులు, వ్యతిరేకించినా ప్రభుత్వం బలవంతంగా ప్రయోగించింది.

1వ తేదీన జీతాలే మరిచిపోయారు..



గత ప్రభుత్వంలో ఉపాధ్యాయులకు 1వ తేదీనే జీతంపడేది. నెలంతా కష్టపడితే.. 1వ తేదీ రాగానే..ఠంచన్‌గా తమ బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం జీతాలు వేసేది. దీంతో కుటుంబ అవసరాలతోపాటు, పిల్లలకు ఫీజుల చెల్లింపు, బ్యాంకుల్లో తీసుకున్న రుణాలకు ఈఎంఐల చెల్లింపు, వృద్ధుల ఆసుపత్రి ఖర్చులతోపాటు, ఇతర అవసరాలకు ఏ మాత్రం కష్టం లేకుండా సాగిపోయేది. జగన్ ప్రభుత్వం వచ్చాక.....టీచర్లలో టెన్షన్ మొదలైంది. నెలంతా కష్టడినా... 1వతేదీ చూస్తే..ఖతాలు ఖాళీగానే ఉంటున్నాయి. 1వ తేదీ జీతాలు మరిచిపోయామని వారే వాపోతున్నారు. ఈ క్రమంలో బ్యాంకుల్లో తీసుకున్న గృహరుణాలు, వాహన రుణాలు, పిల్లల చదువులు లోన్స్‌కు ఈఎంఐలు సకాలంలో చెల్లించ లేక... అదనపు ఛార్జీలు చెల్లించిన సందర్భాలు అనేకం. దీంతో ఉపాధ్యాయులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.



వైసీపీ జెండాలు పట్టుకుని ఈలలు వేస్తూ రెచ్చగొడుతున్న వైసీపీ వర్గీయులు

మద్దలచెరువులో ఉద్రిక్తత

- ఎన్నికల ప్రచారం నిర్వహించిన పరిటాల సునీత
- పార్టీ జెండాలతో వైసీపీ వర్గీయుల కవ్వింపు చర్యలు
- ఎస్పీ, ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామన్న సునీత

ధర్మవరంరూరల్, మార్చి 24: ఎన్నికల ప్రచారానికి వచ్చిన టీడీపీ నాయకులను చూసి వైసీపీ వర్గీయులు కవ్వింపు చర్యలకు దిగడంతో కనగానపల్లి మండలం మద్దలచెరువులో ఆదివారం ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. అయితే మాజీమంత్రి పరిటాల సునీత కలగజేసుకుని తమ నాయకులు, కార్యకర్తలను సంయమనం పాటించాలని సూచించడంతో పరిస్థితి సద్దుమణిగింది. సమస్యాత్మక గ్రామంలో పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టకపోగా, ఏకపక్షంగా వ్యవహరించడంతోనే ఇలాంటి ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడటానికి కారణం అయ్యాయని టీడీపీ వర్గీయులతో పాటు గ్రామస్థులు సైతం పెదవి విరుస్తున్నారు. మద్దలచెరువు గ్రామంలో మాజీమంత్రి పరిటాల సునీత ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం రోడ్‌షో నిర్వహించారు. ఈ క్రమంలో మద్దెలచెరువు సూరి అలియాస్ గంగుల సూర్యనారాయణరెడ్డి ఇంటి సమీపంలో ప్రచార రథం వెళుతుండగా అప్పటికే అక్కడ గుమిగూడి ఉన్న కొందరు వైసీపీ వర్గీయులు మద్యం మత్తులో వైసీపీ జెండాలు తిప్పుతూ, తొడలు కొడుతూ, ఈలలు వేస్తూ కేకలు, అరుపులతో కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. దీంతో టీడీపీ వర్గీయులు కొంతమంది వారిని చూసి టీడీపీ కండువాలను తిప్పారు. ఈ క్రమంలో ఇరువర్గాల కేకలు, అరుపులతో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. మాజీ మంత్రి పరిటాల సునీత కలుగజేసుకుని టీడీపీ కార్యకర్తలందరూ సంయమనం పాటించాలని కోరారు. ఓటమి భయంతోనే వైసీపీ వర్గీయులు రెచ్చగొడుతున్నారని ఆమె తెలిపారు. ఈసారి రాప్తాడులో టీడీపీ గెలుస్తుందన్న భయంతో తోపుదుర్తి సోదరులు వైసీపీ కార్యకర్తలతో మద్యం తాగించి ఇలా టీడీపీ ప్రచారాల్లోకి రెచ్చగొట్టి పంపుతున్నారని ఆరోపించారు. ఎన్నికల ప్రచారానికి తాము అధికారుల నుంచి అనుమతి తీసుకుని గ్రామానికి వచ్చామని, ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా పోలీసులు ముందుజాగ్రత్తలు తీసుకోవడంలో విఫలమయ్యారని విమర్శిం చారు. పోలీసులలో కూడా కొందరు ఏకపక్షంగా వ్యవహరిస్తూ రెచ్చగొట్టే వారిని కాకుండా టీడీపీ వర్గీయులనే వీడియోలు తీస్తూ భయభ్రాంతు లకు గురిచేస్తున్నారని, ఈ విషయంపై ఎస్పీ, ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తానని ఆమె తెలిపారు. కాగా సూరి భార్య భానుమతి ఆరోగ్యం బాగా లేదని తెలిసి తానెంతో బాధపడ్డానని ఆమె పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ వచ్చినప్పటికీ కూడా కొంతమంది పోలీసులు ఇంకా అధికారపార్టీకి వంతుపాడుతూ వారికి అనుకూలంగా వ్యవహరించడం తోనే ఇలాంటి దుశ్చర్యాలకు వైసీపీ వర్గీయులు పాల్పడుతున్నట్లు టీడీపీ వర్గీయులు ఆరోపించారు.



సూరి ఇంటి ముందు ఉద్రిక్త పరిస్థితి



కోడూరు వద్ద జాతీయ రహదారిపై బోల్తా పడిన ఆర్టీసీ బస్సు

ఆర్టీసీ బస్సు బోల్తా

- ఐదుగురికి గాయాలు

చిలమత్తూరు, మార్చి 24: ఎదురుగా వస్తున్న వాహనాన్ని డ్రైవర్ తప్పించ బోగా తాడిపత్రి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఐదుగురు గాయపడ్డారు. తాడిపత్రి డిపోకు చెందిన ఆర్టీసీ డీలెక్స్ బ స్సు బెంగళూరు నుంచి తాడిపత్రి వెళుతోంది. ఆ బస్సు ఉదయం 10 గంటల సమ యంలో కోడూరు తోపు వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న వాహనాన్ని డ్రైవర్ తప్పించ బోగా... రోడ్డు పక్కన ఉన్న సేఫ్టీ ఫోల్స్‌ని ఢీకొట్టి బస్సు బోల్తాపడింది. డ్రైవర్ రామ్మోహన్ వేగం తగ్గించి బస్సును నడపతుండటంతో కొంత వరకు పెద్ద ప్రమాదమే తప్పిందని ప్రయాణికులు తెలిపారు. ఈ సమయంలో బస్సులో 22 మంది ప్రయాణిస్తున్నారు. వారిలో ఐదుగురు గాయపడ్డారు. బస్సు బోల్తాపడిన వెంటనే స్థానికులు అక్కడికి చేరుకొని ఎమెర్జెన్సీ విండోలను పగులగొట్టి ప్రయాణి కులను సురక్షితంగా బయటికి తీశారు. ఈ ప్రమాదంలో బుక్కరాయసముద్రానికి చెందిన లక్ష్మీదేవమ్మ, అజయ్, తాడిపత్రికి చెందిన లక్ష్మీనారాయణ, ఉరవకొండకు చెందిన కళావతి, బస్సు డ్రైబర్ కం కండక్టర్ రామ్మోహన్ గాయపడ్డారు. సమా చారం తెలుసుకున్న ఏఎస్ఐ సుబ్రహ్మణ్యం ప్రమాద స్థలానికి చేరుకున్నారు. గాయపడిన వారిని 108 వాహనంలో హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

తగ్గేదేలే..!

ఎన్నికల ప్రచారంలో పాల్గొనకూడదన్న నిబంధనలను ఉమ్మడి జిల్లాలో వలంటీర్లు, స్టోర్ డీలర్లు బేఖాతరు చేస్తున్నారు. ఎవరెన్ని చెప్పినా, చర్యలు తీసుకున్నా తగ్గేదేలా అంటూ ప్రచారంలో పాల్గొంటున్నారు. వీరిపై కొన్ని చోట్ల చర్యలు తీసుకుంటున్నారు. మరికొందరికి నోటీలసులు ఇస్తున్నారు. అయినా మార్పు రావడం లేదు. - (న్యూస్ నెట్‌వర్క్, ఆంధ్రజ్యోతి)

- తనకల్లు మండలంలోని రాచినేపల్లి గ్రామంలో శనివారం వైసీపీ అభ్యర్థి మక్బూల్ అహమ్మద్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో రాచినేపల్లి పంచాయతీకి చెందిన వలంటీర్లు మనోహర్ నాయుడు, శ్రీహరి నాయుడు పాల్గొన్నారు. ఇంటింటికెళ్లి ప్రచారం నిర్వహించారు.



తనకల్లు మండలంలో వైసీపీ ప్రచారంలో వలంటీరు (వృతంలో)

- గుడిబండ మండలంలోని మోపుర



గుడిబండ ప్రచారంలో వలంటీర్ మహలింగప్ప (వృత్తంలో..)

గుండ్లు గ్రామంలో మూడు రోజుల క్రితం వైసీపీ నాయకులు నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో దేవరహట్టి పంచాయతీ బీఎం పాళ్యం గ్రామ వలంటీరు ఎన్నికల ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన మహలింగప్పపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

విధుల నుంచి వలంటీర్ తొలగింపు

తనకల్లు: మండలంలోని రాచినేపల్లికి చెందిన వలంటీర్ కమలాకర్‌నాయుడును విధులనుంచి తొలగించినట్లు ఎంపీడీఓ పూల నరసింహులు ఆదివారం తెలిపారు. రాచినేపల్లిలో వైసీపీ శనివారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో వలంటీర్ కమలాకర్‌నాయుడు పాల్గొన్నారు. ఈవిషయం పత్రికల్లో ప్రచురితమవడంతో స్పందించిన ఎంపీడీఓ వలంటీర్‌ను విధులనుంచి తొలగించినట్లు తెలిపారు.

ఫీల్డ్ అసిస్టెంట్, వలంటీర్ సస్పెన్షన్

బుక్కరాయసముద్రం: శింగనమల నియోజకవర్గం వైసీపీ అభ్యర్థి వీరాంజినేయుల ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఒక ఫీల్డ్ అసిస్టెంట్, గ్రామ వలంటీర్‌ను సస్పెండ్ చేశారు. మరో ముగ్గురు డీలర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు ఆర్వో వెన్నల శీను తెలిపారు. శింగనమల మండలంలో వెస్ట్ నరసాపురం ఫీల్డ్ అసిస్టెంట్ భాస్కర్, గ్రామ వలంటీర్ వెంకటేశులు వైసీపీ అభ్యర్థి వీరాంజినేయులుకు మద్దతుగా ప్రచారం చేయడంతో సంబంధిత శాఖ అధికారుల నివేదిక అధారంగా ఇద్దరిని సస్పెండ్ చేసినట్లు ఆర్వో తెలిపారు. బుక్కరాయసముద్రం మండల నీలంపల్లి గ్రామంలో ప్రచారంలో పాల్గొన్న డీలరు భర్త ప్రభాకర్‌రెడ్డి, టీకేఎస్ డీలర్లు శేషానందారెడ్డి, రాజారెడ్డికి షోకాజ్ నోటీసులు ఇచ్చామన్నారు. రెవెన్యూ అధికారుల నివేదిక అనంతరం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కోడ్ ఉల్లంఘించిన వారిపై వేటు

- వలంటీర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, డీలర్లు, పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్: కలెక్టర్

అనంతపురం టౌన్, మార్చి 24: ఎన్నికల కమిషన్ ఆదేశాలు లెక్కచేయకుండా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వలంటీర్లు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, రేషన్ డీలర్లు, పంచాయతీ కార్యదర్శిని విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు కలెక్టర్ గౌతమి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లావ్యాప్తంగా 18 మంది వలంటీర్లు, ఐదుగురు రేషన్ డీలర్లు, ఇద్దరు ఫీల్డ్ అసిస్టెంట్లు, ఒక పంచాయతీ కార్యదర్శిని తొలగించినట్లు తెలిపారు. పోస్టర్లు, బ్యానర్లు తొలగించలేదని, గోడలపై పార్టీ రంగులు, పేర్లు తొలగించలేదని సీ విజిల్ డిజిటల్ యాప్ ద్వారా 168 ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఆ ఫిర్యాదులను ఎన్నికల కమిషన్ సూచనల మేరకు 100 నిమిషాల్లో పరిష్కరించామన్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌లో భాగంగా 5,036 పోస్టర్లు, 2,204 బ్యానర్లు, 627 గోడలపై పార్టీ రాతలు తొలగించామన్నారు. 2,986 నాయకుల విగ్రహాలు, ఫొటోలను వస్త్రాలతో కప్పివేశామన్నారు. అనుమతి లేకుండా తరలిస్తున్న రూ. 16.94 లక్షలను సీజ్ చేశామని తెలిపారు.

ప్రజాధనంతో వేతనం... వైసీపీ సేవలో నిమగ్నం

పెనుకొండ టౌన్, మార్చి24: ప్రజాధనంతో వేతనం తీసుకుంటున్న ఓ ఉద్యోగి వైసీపీకి చేస్తున్నారు. ఎన్నికల నిబంధనల మేరకు అధికారులు, ప్రభుత్వ వేతనం తీసుకునే ఉద్యోగులు ఏ రాజకీయ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనకూడదని ఆదేశాలు ఉన్నాయి. అయినా పలువురు ఉద్యోగులు అధికార పార్టీ అండతో బరితెగిస్తూనే ఉన్నారు. వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీ చరణ్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమందేపల్లి మండలంలో ఇంటింటికి తిరుగుతున్నారు. ఈ క్రమంలో ఆదివారం మండలకేంద్రంలోని మారుతినగర్‌లో ప్రభుత్వ వేతనం తీసుకొనే ఒకటో సచివాలయ కం ప్యూటర్ ఆపరేటర్ భార్గవి, ఆమె భర్త మహేష్ ఎమ్మెల్యే అభ్యర్థికి పూలమాల వేసి సన్మానించారు. తిరిగి ఆమె ఆ పూలమాలను ఉద్యోగి భర్తకు వేయడం చర్చనీయాంశమైంది.



సచివాలయ ఉద్యోగి (వృత్తంలో) ఇంట్లో వైసీపీ కార్యక్రమం

కోడ్ ఉల్లంఘించారని ఈసీకి ఫిర్యాదు

కదిరి, మార్చి 24: ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించి హిందూపురం పార్లమెంటు వైసీపీ అభ్యర్థి బోయ శాంత, కదిరి నియోజకవర్గ అభ్యర్థి మగ్బూల్ అహ్మద్ సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారని టీడీపీ కదిరి నియోజకవర్గ ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్ ఆదివారం ఎన్నికల కమిషన్‌కు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేశారు. ఈనెల 16 వ తేదీ నుంచి ఎన్నికల నిబంధనలు రాష్ట్రంలో అమల్లోకి వచ్చాయన్నారు. వీటికి విరుద్ధంగా ఈనెల 17న సీఎంఆర్ఎఫ్ చెక్కులను నంబులపూలకుంట మండలం మేకలచెరువులో వైసీపీ అభ్యర్థులు పంపిణీ చేశారని చెప్పారు. దీనిపై చర్యలు తీసుకోవాలని ఆయన ఫిర్యాదులో కోరారు.

నీట్, ఎంసెట్‌కు ఉచిత శిక్షణ

అనంతపురం విద్య, మార్చి 24: ఎంసెట్, నీట్, జేఈఈ తదితర పోటీ పరీక్షలకు సన్నద్ధం అవుతున్న విద్యార్థులకు స్థానిక కమలానగర్‌లోని సాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు ఆ సంస్థ ప్రతినిధులు ఓబిరెడ్డి, గజలక్ష్మీ ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఉచిత శిక్షణ కోసం ఈనెల 27, 31 తేదీల్లో టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తామన్నారు. ఎంపికైన విద్యార్థులకు నిపుణులైన అధ్యాపకులతో శిక్షణ ఇస్తామన్నారు. వివరాలకు కమలానగర్‌లోని తమ ఇన్‌స్టిట్యూట్‌లోగానీ, 9059723829, 7509033379 నంబర్లలోగానీ సంప్రదించాలని తెలిపారు.

అనాథలైన చిన్నారులకు న్యాయం చేయాలి

- రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన దామోదర్ నాయుడి బంధువుల ఆందోళన
- పోలీసు స్టేషన్ ఎదుట మృతదేహంతో బైఠాయింపు

పుట్టపర్తి రూరల్, మార్చి 24: రోడ్డు ప్రమాదాల్లో తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మారిన చిన్నారులకు న్యాయం చేయాలంటూ శ్రీసత్యసాయి జిల్లాకేంద్రమైన పుట్టపర్తిలో అర్బన్ పోలీసు స్టేషన్ ఎదుట మృతుడి బంధువులు మృతదేహంతో ఆందోళన నిర్వహించారు. పట్టణంలోని శ్రీసత్య సాయి ప్రైమరీస్కూల్ ఎదుట శనివారం మధ్యాహ్నం ఇన్నోవా కారు స్కూటీని ఢీకొన్న ప్రమాదంలో స్థానిక హోటల్ యాజమాని లెక్కల దామోదర్‌నాయుడు మృతి చెందిన విషయం విధితమే. మృతదేహానికి పెనుకొండ ఆస్పత్రిలో ఆదివారం ఉదయం పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని బంధువులు, పెద్దకమ్మవారిపల్లి గ్రామస్థులు అర్బన్ పోలీసు స్టేషన్ ఎదుట ఉంచి ఆందోళనకు దిగారు.

పలువురు మాట్లాడుతూ అర్బన్ సీఐ కేసును పక్కదారి పట్టించేలా ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఒకానొక దశలో మహిళలు, పురుషులు స్టేషన్లోకి వెళ్లడానికి ప్రయత్నించారు. పుట్టపర్తి అర్బన్, రూరల్, బుక్కపట్నం పోలీసులతో పాటు స్పెషల్‌పార్టీ పోలీసులు అక్కడికి చేరుకుని ఆందోళనకారులను స్టేషన్‌లోకి వెళ్లకుండా అడ్డుకున్నారు. రూరల్ సీఐ రాగిరి రామయ్య ఆందోళనకారులతో చర్చించినప్పటికీ ఫలితం లేకపోయింది. డీఎస్పీ వాసుదేవన్ అక్కడకి చేరుకుని వారిని సముదాయించారు. ఇంతలో అక్కడకు చేరుకున్న మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి పోలీసు అధికారులతో మాట్లాడి బాధితకుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. డీఎస్పీ మాట్లాడుతూ అనుకోకుండా ప్రమాదం జరిగిందని, ఈ ఘటనకు బాధ్యులైన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని, పోలీసు స్టేషన్ ఎదుట ఆందోళన చేయడం సరైంది కాదని, ఆందోళనకారులను సముదాయించాలని పల్లెను కోరారు. మృతు డి కుటుంబానికి న్యాయం చేసేవరకు ఇక్కడినుంచి కదిలేదిలేదని ఆందోళనకారులు పేర్కొనడంతో.. పల్లె ఎస్పీ మాధవరెడ్డితో ఫోన్‌ద్వారా మాట్లాడారు. మొదట మృతదేహాన్ని అక్కడి నుంచి తీసుకెళ్లి అంత్యక్రియలు నిర్వహించాలని, ఆ తర్వాత సమావేశం ఏర్పాటు చేసి బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చర్చిద్దామని ఎస్పీ పేర్కొనడంతో.. మృతదేహాన్ని అంత్యక్రియలకు తీసుకెళ్లారు. స్టేషన్ ఎదుట రోడ్డుపై బైఠాయించడంతో సుమారు మూడుగంటల పాటు ట్రాఫిక్ స్తంభించింది. తొమ్మిదేళ్ల క్రితం రోడ్డుప్రమాదంలో తల్లి, ఇప్పుడు తండ్రిని కోల్పోయి చిన్నారులు అనాథలయ్యారు.



మృతదేహంతో ధర్నాచేస్తున్న బంధువులు

మహిళ ఆత్మహత్య

రామగిరి, మార్చి 24: మండలంలోని గరిమేకలపల్లి గ్రామానికి చెందిన మాదిగ రామలక్ష్మి (38) శనివారం రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. రామలక్ష్మి భర్త నారాయణ కొన్ని సంవత్సరాల క్రితం చనిపోవడంతో ఆమె ఒంటరిగా జీవిస్తోంది. ఆమెకు సమీప బంధువులు కూడా లేరు. ఆదివారం ఉదయం ఆమె ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న విషయాన్ని గమనించి స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని ధర్మవరం ఆస్పత్రికి తరలించామని, కేసు దర్యాప్తులో ఉందని రామగిరి ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

ముగిసిన లాక్రోస్ జాతీయ శిక్షణ శిబిరం


శిబిరం ముగింపులో లాక్రోస్ క్రీడాకారులు

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 24: స్థానిక వేణుగోపాల్ నగర్‌లోని సాఫ్ట్‌బాల్ స్టేడియంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న జాతీయ లాక్రోస్ శిక్షణ శిబిరం ఆదివారంతో ముగిసింది. ఎంపికైన ఏపీ రాష్ట్ర లాక్రోస్ బాలుర జట్టులో... నవీన్‌కుమార్, ఆంద్రయహ, ప్రవీణ్, వెంకటేష్, శాంతరాజ్, శివ, మహేష్, శ్రీనివాసరెడ్డి ఉన్నారు. బాలికల జట్టుకు.. ఏ శ్రీలక్ష్మి, ఫాతిమా, సింధుప్రియ, వీ శ్రీలక్ష్మి ఎంపికయ్యారు. వీరు ఈనెల 29 నుంచి ఆగ్రాలో నిర్వహించే జాతీయ లాక్రోస్ చాంపియన్ టోర్నీలో పాల్గొంటారు. కార్యక్రమంలో నోబుల్ హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు మిరాజుద్దీన్, భాస్కర్‌రెడ్డి, జిల్లా లాక్రోస్ అసోసియేషన్ కార్యదర్శి రాధిక, కోశాధికారి లింగప్రసాద్, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

ఘనంగా మట్టల ఆదివారం

అనంతపురం కల్చరల్, మార్చి 24 : గుడ్‌ఫ్రైడేకు ముందు నిర్వహించే మట్టల ఆదివారం వేడుకలను నగరంలో ఘనంగా నిర్వహించారు. అరవిందనగర్‌లోని సీఎస్ఐ హోలి ట్రినిటి చర్చి ఆధ్వర్యంలో సీఎస్ఐ రాయలసీమ దయాసిస్ బిషప్ రెవరెండ్ ఐజక్ వరప్రసాద్ నేతృత్వంలో ఆదివారం క్రైస్తవులంతా కలిసి మట్టలతో నగరోత్సవం నిర్వహిస్తూ క్రీస్తు భక్తిగీతాలు ఆలపించారు. అనంతరం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో సీఎస్ఐ హోలిట్రినిటి చర్చి కమిటీ సభ్యులు, సండేస్కూల్ విద్యార్థులు, సంఘసభ్యులు పాల్గొన్నారు.


ఆధ్యాత్మిక సందేశమిస్తున్న వరప్రసాద్

పశువుల సంత ఆదాయం రూ.3.45 లక్షలు

అనంతపురంరూరల్, మార్చి 24: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో జరిగిన పశువుల సంతతో మార్కెట్‌కు రూ.3,45,390 ఆదాయం వచ్చిందని మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి ఆదివారం తెలిపారు. శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత ద్వారా మార్కెట్‌కు రూ.1,70,090, ఆదివారం జరిగిన ఎనుములు, ఎద్దులు, ఆవుల సంతతో రూ.1,75,300 ఆదాయం వచ్చిందని తెలిపారు.

ఎన్నికల కోడ్ ఫిర్యాదులకు కంట్రోల్ రూమ్

రాప్తాడు, మార్చి 24: ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై ఫిర్యాదులు స్వీకరించేందుకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు రాప్తాడు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వసంత్‌బాబు పత్రికా ప్రకటనలో తెలిపారు. 08554 291001 నంబర్‌కు ఫోన్ చేసి ఎన్నికల కోడ్‌కు సంబంధించిన ఏవైనా ఫిర్యాదులు చేయవచ్చన్నారు. ఈ నంబర్‌కు వచ్చిన ఫిర్యాదులు స్వీకరించి సంబంధింత మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ టీమ్‌కు ఫార్వర్డ్ చేస్తామన్నారు. టీమ్ సభ్యులు తనిఖీ లేదా విచారణ చేపట్టి ఎన్నికల నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటారన్నారు. దీన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

జూదరుల అరెస్ట్

అనంతపురం క్రైం, మార్చి 24: సానిక మారుతినగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో పేకాట ఆడుతున్న 11 మందిని నాలుగో పట్టణ పోలీసులు ఆదివారం అరెస్ట్ చేసినట్లు సీఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. వారి నుంచి రూ.30,230 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

అనాథాశ్రమంలో అన్నదానం

అనంతపురం కల్చరల్, మార్చి 24: కాట్నేకాలవ సమీపంలోని ఆశ్రయ అనాథాశ్రమంలో జంగటిశెట్టి కృష్ణమూర్తి సేవా ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం అన్నదానం నిర్వహించారు. ట్రస్టు వ్యవస్థాపకుడు జంగటిశెట్టి కృష్ణమూర్తి తృతీయ వర్ధంతిని పురస్కరించుకుని ట్రస్టు సభ్యులు వెంకటరత్నం, అనీల్‌కుమార్ అనాథలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆశ్రమం వ్యవస్థాపకుడు కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

తాడిపత్రిటౌన్, మార్చి 24: మండలంలోని గంగాదేవిపల్లి గ్రామానికి చెందిన నాగరాజు (23) ఆదివారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు. గ్రామానికి చెందిన పెద్దనాగన్న, పార్వతి దంపతుల కుమారుడు నాగరాజు. డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగించేవా డు. కొంతకాలం క్రితం నాగరాజుకు నంద్యాలకు చెందిన యువతితో నిశ్చితార్థం జరిగింది. కొన్ని కారణాల వల్ల పెళ్లి రద్దు కావడంతో నాగరాజు ఆదివారం ఇంటిలో ఎవరూలేని సమయంలో ఉరివేసుకొన్నాడు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని.. దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ మల్లికార్జున తెలిపారు.

శ్రావణిశ్రీని గెలిపిద్దాం

పుట్లూరు, మార్చి 24: మండలంలోని సూరేపల్లి గ్రామంలో ఆదివారం టీడీపీ నాయకులు ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. టీడీపీ నాయకులు రామాంజనేయులు మాట్లాడుతూ బండారు శ్రావణిశ్రీని ఎమ్మెల్యేగా గెలిపిస్తే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రామానాయుడు పాల్గొన్నారు.

జీడిపల్లి రిజర్వాయర్‌కు ఆగిన ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, మార్చి 24: మండలంలోని జీడిపల్లి రిజర్వాయరులో ప్రస్తుతం 0.396 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు ఆదివారం హంద్రీనీవా అధికారులు తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయరులో ఇన్‌ఫ్లో 0 క్యూసెక్కులు వస్తుండగా ఇక్కడి నుంచి ఫేజ్-2కు ఔట్‌ఫ్లో కింద 400 క్యూసెక్కులు వెళ్తోందని తెలిపారు.

పేరూరు ప్రాజెక్టుకు నీరు తీసుకొస్తాం

- భూములిచ్చిన రైతులకు పరిహారం అందిస్తాం
- ఎమ్మెల్యే ప్రకాష్ అరాచకాలకు ముగింపు పలుకుదాం
- మాజీ మంత్రి పరిటాల సునీత

ధర్మవరంరూరల్, మార్చి 24 : తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే పేరూరు ప్రాజెక్టుకు ఖచ్చితంగా నీరు తీసుకువస్తామని మాజీ మంత్రి పరిటాల సునీత పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కనగానపల్లి మండలంలోని కేఎస్‌పాళ్యం, శివపురం, శివపురం కొట్టాల, మద్దలచెరువు, వేపకుంట, మద్దలచెరువు తండా, కొండపల్లి తదితర గ్రామాల్లో ఆమె విస్తృతంగా పర్యటించారు. ఆమె మాట్లాడుతూ.... రాప్తాడు ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి అసమర్థత వల్లే పేరూరు ప్రాజెక్టుకు నీరు అందలేదని విమర్శించారు. గతంలో తాము మొదలు పెట్టిన ప్రాజెక్టులను ఇప్పటివరకు ఒక్క అడుగు ముందుకు పడలేదన్నారు. కనీసం రైతులకు పరిహారం కూడా ఇచ్చినా దాఖలాలు లేవన్నారు. కర్ణాటక నుంచి నీరు తెచ్చామని గొప్పలు చెబుకుంటూ ఐదేళ్ల కాలం గడిపారన్నారు. కనీసం వర్షానికి డ్యాం నిండితే ఆ నీటిని కూడా రైతులకు సక్రమంగా అందించలేని దుస్థితిలో వైసీపీ పాలన ఉందని విమర్శించారు. పేరూరు ప్రాజెక్టుకు నీరు అందించే క్రమంలో భూములు ఇచ్చిన రైతులందరికి ప్రస్తుత ధర ప్రకారం ఖచ్చితంగా చెల్లిస్తామని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నెట్టెం వెంకటేష్, కన్వీనర్ యాతంపోతలయ్య, సుధాకర్ చౌదరి, తెలుగుయువత బట్టాసురేష్‌చౌదరి, ప్రభాకర్ నాయుడు, చంద్రాయుడు, ఎంపీటీసీ బిల్లేభాస్కర్, రామాంజి, బోదులస్వాతి, నాగా ర్జున, తలారి రాజప్ప, బిల్లేదాము పాల్గొన్నారు. వేపకుంట గ్రామంలో వైసీపీ నుంచి 10 కుటుంబాలు టీడీపీలోకి చేరాయి. కొండపల్లిలో పది కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలో చేరాయి.

వైసీపీ నాయకుల దౌర్జన్యానికి చేనేత కుటుంబం బలి: వైసీపీ ప్రభుత్వ దాష్టీకానికి రాజంపేట నియోజకవర్గంలో ఒంటిమిట్ట మండలం కొత్తమాదవరం గ్రామంలో చేనేత కుటుంబం బలి కావడం బాధాకరమని పరిటాల సునీత తెలిపారు. సీఎం సొంత జిల్లాలోనే పేదల భూములు లాగేసుకుం టున్నారంటే ఇక రాష్ట్రంలో పరిస్థితి ఏంటో అర్థం చేసుకోవచ్చున్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి

రామగిరి: చెన్నేకొత్తపల్లి మండలంలోని వెంకటాంపల్లి, ఆమిదాల కుంట, చెన్నేకొత్తపల్లి గ్రామాల నుంచి దాదాపు 18 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలోకి చేరాయి. ఆదివారం వెంకటాపురంలో పరిటాల సునీత వారిని పార్టీలోకి ఆహ్వానించారు.

ఎమ్మెల్యే సొంత మండలంలో...

ఆత్మకూరు : రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సొంత మండలంలోని ఆత్మకూరు గ్రామానికి చెందిన 11 కుటుంబాలు పరిటాల సునీత సమక్షంలో టీడీపీలో చేరాయి. వెంకటాపురంలోని ఆమె నివాసంలో ఆదివారం వీరు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.


శివపురంలో మహిళలతో కలిసి సూపర్-6 పథకాల కరపత్రాలను చూపుతున్న పరిటాల సునీత

చంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యం

ద్విసభ్యకమిటీ సభ్యులు ఆలం, కేశవరెడ్డి

బుక్కరాయసముద్రం, మార్చి 24: రాష్ట్రంలో చంద్రబాబు సీఎం అయితేనే... రాష్ట్రాం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధ్యమని శింగనమల నియోజకవర్గం ద్విసభ్యకమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం బుక్కరాయ సముద్రం మండల కేంద్రంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి, జిల్లా టీడీపీ ఉపాధ్యాక్షులు పసుపుల హనుమంతురెడ్డి, జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి పర్వతనేని శ్రీధర్‌బాబు, కన్వీనర్ అశోక్ పాల్గొన్నారు.


బుక్కరాయసముద్రంలో ఇంటింటి ప్రచారంలో టీడీపీ నాయకులు


రామగిరి మండలం గంతిమర్రి, చెన్నేకొత్తపల్లి మండలం వెల్దుర్తి గ్రామంలో ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు


ఆత్మకూరు బీసీ కాలనీలో టీడీపీ నాయకుల ప్రచారం, రాప్తాడు మండలం మరూరులో టీడీపీలో చేరుతున్న వైసీపీ శ్రేణులు


అనంతపురంరూరల్ మండలం కురుగుంట వైఎస్సార్ కాలనీ, మన్నీలలో ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ శ్రేణులు

రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపిక

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 24: స్థానిక గుత్తిరోడ్డులోని కనకదాస కళ్యాణమండపంలో ఆల్ అనంతపురం చెస్ అసోసియేషన్, ఆంధ్రా చెస్ అసోసియేషన్, ఏ1 చెస్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో ఏపీ రాష్ట్రస్థాయి ఓపెన్ ర్యాపిడ్ చెస్ టోర్నమెంట్-2024 పోటీలు ఆదివారం నిర్వహించారు. ఎంపికైన క్రీడాకారుల వివరాలను ఆల్ అనంతపురం చెస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి, ఇంటర్నేషనల్ ఆర్బిటార్ ఉదయ్‌కుమార్‌నాయుడు ప్రకటించారు. ఓపెన్ క్యాటగిరిలో మన్యసాయి, మాధవ నాయుడు, అస్మిత, వెంకట శ్రీచైతన్యరెడ్డి, అజయ్, కౌశిక్, వెంకట సుదీంద్ర, నితీష్‌చౌదరి, నరేష్‌కుమార్, యశస్విని ఎంపికయ్యారు. బాలికల విభాగంలో.. అసీఅలీ, ధన్యశ్రీ కోమల, తేజస్వి, నౌమిక ఎంపికయ్యారన్నారు. బాలుర విభాగంలో సిద్దార్థరెడ్డి, సాకేత్, వినూత్, చక్రధర్‌నాథ్, సాయిచరణ్ ఎంపికయ్యారు. ఈ క్రీడాకారులు జూన్ 4 నుంచి భీమవరంలో నిర్వహించే రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో ఆల్ అనంతపురం చెస్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు బాలరాజు, టోర్నీ డైరెక్టర్ కిశోర్‌నాయుడు, కోఆర్డినేటర్ గోవిందరాజులు, జగదీష్, కాశీవిశ్వనాథ్, శీనయ్య, ఏ1 చెస్ అకాడమీ చైర్‌పర్సన్ తులసమ్మ, చీఫ్ ఆర్బిటార్ గౌతమి పాల్గొన్నారు.


రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

కరపత్రాలతో ముస్లింలను మభ్యపెడుతున్న వైసీపీ

గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్‌మొద్దీన్



అనంతపురం అర్బన్, మార్చి 24 : వైసీపీ నాయకులు ముస్లిం ఐక్యవేదిక పేరుతో కరపత్రాలు పంపిణీ చేసి వారిని మభ్యపెట్టాలని ప్రయత్నిస్తున్నారని గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్‌మొద్దీన్ మండిపడ్డారు. ఆదివారం నగరం లోని ఆయన క్యాంపు కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడారు. తెలుగు దేశం పార్టీ స్థాపించిన నాటి నుంచి అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధి కోసం పాటుపడిందన్నారు. ముస్లిం మైనార్టీల కోసం దుల్హన్ పథకం, విదేశీ విద్య తదితర పథకాలు అమలు చేసిందన్నారు. టీడీపీ ఏం చేసినా ఏపీ అభివృద్ధి కోసమే చేస్తుందన్నారు. రాష్ట్ర ప్రయోజనాలు, ప్రజల సంక్షేమం కోసమే బీజేపీతో టీడీపీ పొత్తు పెట్టుకుందన్నారు. టీడీపీ ఎల్లప్పుడూ సెక్యూలర్ భావనతోనే ఉంటుం దన్నారు. గత ఐదేళ్లల్లో ముస్లిం మైనార్టీల కోసం వైసీపీ ఒక్క పథకానైనా ప్రవేశపెట్టిందా అని ప్రశ్నించారు. రాబోవు ఎన్నికల్లో ముస్లిం మైనార్టీలు ఏకమై ఓటుతో వైసీపీకి తగిన బుద్ధి చెప్పాలని కోరారు. ఎన్నికల కోడ్‌ను ఉల్లంగించి ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి మసీదుల్లోకి వెళ్లి ప్రచారం చేస్తున్నారని, ఈ విషయంపై ఎన్నికల అధికారులు తగు చర్యలు తీసుకోవాలని అన్నారు.

బీకేకు పలువురి శుభాకాంక్షలు


బీకే పార్థసారథికి శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ నాయకులు

అనంతపురం అర్బన్, మార్చి 24: హిందూపురం పార్లమెంట్ టీడీపీ ఎంపీ అభ్యర్థిగా బీకే పార్థసారథిని ఖరారు చేసిన సందర్భంగా టీడీపీ బీసీ సెల్ నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం అనంతపురం నగరంలోని బీకే పార్థసారథి నివాసంలో ఆయనకు పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆవుల కృష్ణయ్య, నాయకులు రంగనాయకులు, ఆవుల సురేష్, బండి పరశురాం, శ్రీధర్, రాము, సుబ్బన్న, రామచంద్ర, గంగాధర్, కేశవ, చిట్టి ఉన్నారు.

టీడీపీలో వడ్డెర్లకు ప్రాధాన్యం ఇవ్వాలి


మీడియాతో మాట్లాడుతున్న నాయకులు

అనంతపురం అర్బన్, మార్చి 24: తెలుగుదేశం పార్టీలో వడ్డెర్లకు రాజకీయంగా ప్రాధాన్యతనివ్వాలని ఉమ్మడి అనంత జిల్లా వడ్డెర్ల సంక్షేమ సంఘం నాయకులు కోరారు. ఆదివారం స్థానిక ఎంవైఆర్ ఫంక్షన్ హాల్‌లో వడ్డెర్ల సంక్షేమ సంఘం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు జరిపిడి కృష్ణమూర్తి, దళవాయి వెంకటనారాయణ, సిమెంట్ పోలన్న మీడియాతో మాట్లాడారు. తెలుగుదేశం పార్టీలో తొలి నుంచి తాము కొనసాగుతూ పార్టీ పటిష్టతకు పాటుపడుతున్నామన్నారు. దీన్ని పరిగణలోకి తీసుకొని ఉమ్మడి జిల్లాలో టీడీపీ తరపున ఎమ్మెల్యే లేదా ఎంపీ సీటును వడ్డెర్లకు కేటాయించాలన్నారు. ఇప్పటికైనా పార్టీ అధిష్టానం పునరాలోచించి వడ్డెర్లకు తగు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు కుంచెపు వెంకటేష్, దళవాయి మారెప్ప, చక్రపాణి, మల్లికార్జున, గంగులప్ప, ఉత్తన్న, నాగరాజు, హోన్నూరు, నారాయణస్వామి, శ్రీరాములు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత


ఆర్థికసాయం అందజేస్తున్న స్నేహితులు

చెన్నేకొత్తపల్లి, మార్చి 24: తనతో పాటు కలిసి చదువుకున్న చిన్నపాటి మిత్రుడు అకాల మరణంతో అతని కుటుంబానికి స్నేహితులు అండగా నిలిచారు. చెన్నేకొత్తపల్లికి చెందిన బొగ్గునరసింహులు ఏడాదిన్నరక్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. దీంతో అతని కుటుంబం ఇంటిపెద్ద దిక్కును కోల్పోయింది. అతనికి భార్య మంజుల, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఈ నేపథ్యంలో 1998-99 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు గత నెల 25న సమావేశమయ్యారు. మరణించిన స్నేహితుడి కుటుంబానికి తమవంతుగా చేయూత నందించాలని నిర్ణయించుకున్నారు. దీంతో వారంత తోచిన రీతిలో ఆర్థికసాయం అందించారు. ఆదివారం మిత్రుని కుటుంబాన్ని పరామర్శించి సేకరించిన రూ.50వేలు నగదును భార్య మంజులకు అందజేశారు. తాము చదువుకున్న పాఠశాలకు రూ.10వేలు విలువ చేసే కుర్చీలను సమకూర్చారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరగాలి : డీఎస్పీ

నార్పల, మార్చి 24: ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగాలని, అందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని డీఎస్పీ బీ వెంకటశివారెడ్డి సూచించారు. నార్పల మండలంలోని ఫ్యాక్షన్ గ్రామమైన బండ్లపల్లి గ్రామంలో ఆదివారం డీఎస్పీ బీ వెంకటశివారెడ్డి గ్రామ సభ నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల దృష్ట్యా గ్రామంలో ఎటువంటి గొడవలకు, తగాదాలకు పోకుండా ప్రశాంతంగా ఉండాలన్నారు. గ్రామంలో ఏమైనా సమస్యలు ఉంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఎవరైనా గ్రామంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రంగుల హేళి.. రంగోలి

నేడు హోలీ పండుగ

అనంతపురం కల్చరల్, మార్చి 24 : రంగురంగుల హేళి... హోలీ వచ్చేసింది. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ ఆటపట్టించే పండుగ ఇది. వసంత ఋతువు ఆగమనం మనుషుల్లో ఉత్సాహాన్నే కాదు ప్రకృతిలోనూ సరికొత్త సొగసును తెస్తుంది. ఎండిన చెట్లు చిగురించి, పూలు పూస్తాయి. కోయిలలు తమ కమ్మని కంఠంతో వీనులవిందు చేస్తాయి. మల్లెల సువాసనలు వెదజల్లుతూ గుబాళిస్తాయి. ప్రకృతిలోని అందాలన్నీ ఆవిష్కరించే వసంత ఋతువు ప్రవేశించిన తరువాత జరుపుకునే తొలి వేడుక హోళి. ప్రజలంతా ఆనందోత్సాహాల నడుమ జరుపుకునే పండుగ హోలీ. హోలీ పండుగ ఈనాటిది కాదు. ద్వాపరయుగంలోనే ఈ పండుగను జరుపుకున్నట్లు చారిత్రక ఆధారాలు చెబుతున్నాయి. ఈ కారణంగానే స్నేహితులు, బంధువులు, ప్రేమికులు ఒకరిమీద మరొకరు రంగులు చల్లుకోవడం ఆనవాయితీగా వస్తోంది. కాలం మారేకొద్దీ... సింథటిక్ రంగుల వాడకం పెరిగి అనారోగ్యాలు ఎక్కువవుతున్నాయి. అందుకే సహజరంగుల వాడకమే శ్రేయస్కరమని పేర్కొంటున్నారు నిపుణులు. అయితే గత కాలంలో వసంతంలో విరబూసే ఆయా పూలతో సహజరంగులు తయారుచేసుకుని హోలీ ఆడేవారు. హోలీ రంగులు మన జీవితాలతో ఎంతగానో ముడిపడివుంటాయి. వాతావరణ మార్పుల వల్ల శరీరంలోనూ మార్పులు వస్తాయి. అందుకే హోలీనాడు సహజరంగులు తయారు చేసుకుని చల్లుకుంటుంటారు. పాతకాలంలో మోదుగపూలతో తయారైన రంగులను వాడేవారు. ఈ రంగులను చల్లుకోవడం మనసుకు సంతోషాన్ని కలిగిస్తుంది. హృదయం పవిత్రమవుతుంది. ఒక్కో రంగు ఒక్కో సందేశాన్నిస్తుంది. ఎరుపు కోపానికి, ఆకుపచ్చ శుభానికి, పసుపు ఆనందానికి, గులాబీరంగు ప్రేమకు, తెలుపు శాంతికి, నీలం విశ్రాంతి, కాశాయం త్యాగానికి, ఊదా రంగు జ్ఞానానికి ప్రతీకలు. సూర్యమానం ప్రకారం ఫాల్గుణ పౌర్ణమి నేడు. దీంతో తెలుగురాష్ట్రాల్లో సోమవారం హోలీ పండుగను జరుపుకోనున్నారు.



జాగ్రత్త వహించాలి



హోలీలో వాడే రంగులవల్ల చర్మం మీద దుష్ప్రభావాలు చాలా ఉంటాయి. రంగుల్లో రసాయనాలు కలిసుండటంవల్ల అలర్జీ వచ్చే అవకాశముంది. ఈ దుష్ప్రభావాల నుంచి దూరంగా ఉండాలంటే ప్రకృతిసిద్ధ రంగులను వాడడం శ్రేయస్కరం. లేదంటే హోలీ ఆడడానికి ముందే శరీరానికి మాయిశ్చరైజర్ లేదా కొబ్బరి నూనె పూసుకోవడం వల్ల శరీరానికి అంటే అవకాశం తక్కువ. హోలీ ఆడాక రంగులన్నీ మంచినీటితో శుభ్రంగా కడుక్కోవాలి.

- డా. హేమలత, డిప్యూటీ ఆర్ఎంఓ, ప్రభుత్వ సర్వజనాస్పత్రి

శతాబ్దాల చరిత్ర



హోలీ పండుగకు శతాబ్దాల చరిత్ర ఉంది. బంజారాలు, మార్వాడీలకు సంప్రదాయంగా అతి ముఖ్యమైన పండుగ ఇది. బంజారాల సామాజిక వర్గంలో హోలీకి పదిరోజుల ముందునుంచే సంబరాలు మొదలవుతాయి. కాల క్రమేణా అన్ని సామాజిక వర్గాలు హోలీ పండుగను నిర్వహిస్తూవస్తున్నారు. హోలీ రోజున అందరూ కలిసి నృత్యాలు చేయడం, బంధువులను ఇళ్లకు పిలుచుకుని రంగులు చల్లుకుని సంబరం చేసుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

- శారద, ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం

ముమ్మాటికీ అవి వైసీపీ హత్యలే...!

టీడీపీ నాయకుల ధ్వజం
ఒంటిమిట్ట ఘటనపై
నిరసన ర్యాలీ

బుక్కరాయసముద్రం, మార్చి 24: కడప జిల్లాలో ఒంటిమిట్ట మండ లంలో వైసీపీ దాష్టీకానికి ఓ చేనేత కుటుంబం బలైపోయిందని, ఇది ము మ్మాటికీ జగన్ ప్రభుత్వం చేసిన హత్యేనని ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి మండిపడ్డారు. దీన్ని నిరసి స్తూ ఆదివారం బుక్కరాయసముద్రంలోని స్థానిక పెద్దమ్మ గుడి సర్కిల్ వద్ద కొవ్వొత్తులతో ర్యాలీ చేశారు. ఇందులో ద్విసభ్యకమిటీ సభ్యు లతో పాటు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి, జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు పసుపుల హనుమంతురెడ్డి, జిల్లా టీడీపీ అధి కార ప్రతినిధి పర్వతనేని శ్రీధర్‌బాబు, కన్వీనర్ అశోక్ మాట్లాడారు. వైసీపీ నే తల ఒత్తిళ్లు తాళలేక పాల సుబ్బారావు, భార్య పద్మావతి, చిన్న కుమార్తె వినయ ఆత్మహత్యకు పాల్పడటం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిం దన్నారు. నిందితులును కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, హరి, రామానాయుడు, నరేంద్ర యాదవ్, ఆర్‌నారా యణస్వామి, బాబయ్య, అక్కులప్ప, రంగమ్మ, బాబా వలీ పాల్గొన్నారు.

అవి ప్రభుత్వ హత్యలే : బండారు శ్రావణిశ్రీ

శింగనమల: కడప జిల్లాలో ఒంటిమిట్ట మండలంలో చేనేత కుటుంబ సభ్యులు ఆత్మహత్య చేసుకున్నారని, అవి వైసీపీ ప్రభుత్వ హత్యలేనని, వైసీపీ నేతలు భూదాహానికి ఆ కుటుంబం బలైందని శింగనమల టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ ఒక ప్రకటనలో మండిపడ్డారు. నిరుపేద కుటుంబం మూడు ఎకరాల భూమి కోసం వైసీపీ గూండా నేతలతో పోరాడలేక బీసీ కుటుంబ ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమన్నారు. రెవెన్యూ అధికారులు వైసీపీ గూండాలకు వత్తాసు పలకడం చూస్తుంటే ఎన్నికల సజావుగా జరిగే అవకాశం లేదనిపిస్తోందన్నారు. ముఖ్యమంత్రి జగన్ సభా వేదికలపై నా బీసీలు అని చెప్తూ బీసీలపై దౌర్జన్యాలు, హత్యలు జరుగుతున్నా ఏమాత్రం పట్టించుకోకుండా ఉండటాన్ని బీసీలు గమనించాలన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో అనేక కుటుంబాలు వైసీపీ నేతల భూదాహానికి బలైనాయన్నారు. చేనేత కుటుంబం మరణానికి కారణమైన నిందితులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. సొంత జిల్లాలో ప్రజలపై దారుణలు, హత్యలు జరుగుతుంటే ఏమాత్రం స్పందించకుండా ముఖ్యమంత్రి జగన్ మౌనంగా ఉండటం వెనుక ఇంకా ఎన్ని కుట్రలు ఎన్నికలలోపు చేస్తారని ఆందోళన కలిగిస్తోందన్నారు. ఎన్నికల అధికారులు ఈ ఎన్నికలు సజావుగా... ప్రశాంతంగా జరిగేలా తగు చర్యలు తీసుకోవాలని కోరారు.


బీకేఎస్‌లో కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న టీడీపీ శ్రేణులు

సమష్టిగా విజయం సాధిద్దాం



హుళ్లికల్లులో టీడీపీలోకి చేరిన వారితో అమిలినేని సురేంద్రబాబు



ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందజేస్తున్న అమిలినేని సురేంద్రబాబు కోడలు ఇషిత

టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు

కళ్యాణదుర్గం, మార్చి 24: కలసికట్టుగా కళ్యాణదుర్గం నియోజకవర్గంలో టీడీపీని అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు శాయశక్తులా కృషిచేద్దామని ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు పేర్కొన్నారు. ఆదివారం కళ్యాణదుర్గం మండలంలోని దురదకుంటలో ఇంటింటికి వెళ్లి సూపర్‌సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. అనంతరం అమిలినేని సురేంద్రబాబు ప్రతి ఒక్క టీడీపీ నాయకులు, కార్యకర్త ఇంటికి వెళ్లి ఆప్యాయంగా పలకరించారు. దురదకుంట సర్పంచ్ గరికపాటి అరుణమ్మ, నాయకుడు గరికపాటి సురేష్‌లను శాలువా, పూలమాలలతో అమిలినేని సురేంద్రబాబు సత్కరించారు. కళ్యాణదుర్గం కంచుకోటలో ఐక్యతగా వుంటూ ప్రజాబలాన్ని వెలుగెత్తి చాటాల్సిన అవసరం వుందన్నారు. ఆ ప్రజాబలంతోనే టీడీపీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తంచేశారు. కళ్యాణదుర్గం మున్సిపాల్టీ పరిధిలోని 20వ వార్డు మెడా వీధి, 21వ వార్డు కటిక వీధులలో అమిలినేని సురేంద్రబాబు సోదరుడు యర్రిస్వామి పర్యటించారు. ఇంటింటికి తిరుగుతూ సూపర్‌సిక్స్ పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. మున్సిపాల్టీలోని ప్రతి ఇంటికి తాగునీటిని అందించి ఆదర్శ మున్సిపాల్టీగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. టీడీపీకు మద్దతివ్వాలని కోరారు. అదేవిధంగా మున్సిపాల్టీ పరిధిలోని 7వ వార్డు విద్యానగర్‌లో అమిలినేని సురేంద్రబాబు కోడలు ఇషిత, స్థానిక మహిళలు, కార్యకర్తలు, నాయకులతో పర్యటించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలను అందజేశారు. తమపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. ఆ దిశగా మీరంతా టీడీపీకు మద్దతిచ్చి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రతి మున్సిపాల్టీలోను, గ్రామాల్లోను టీడీపీకు ప్రజలు, నాయకులు, కార్యకర్తలు బ్రహ్మరథం పడుతున్నారు. కళ్యాణదుర్గంలో గెలిచేది టీడీపీనేనని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

50 వైసీపీ కుటుంబాలు టీడీపీలోకి..

కళ్యాణదుర్గం మండలంలోని హులికల్లుకు చెందిన 50 వైసీపీ కుటుంబాలు ఆదివారం టీడీపీలోకి చేరాయి. ప్రజా వేదిక వద్ద టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్ర బాబు వీరందరికీ పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆదివారం ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో టీడీపీ విజయఢంకా మోగించడం ఖాయమన్నారు. నియోజకవర్గంలో తాగు, సాగునీరు అందాలంటే టీడీపీతోనే సాధ్యమవుతుందన్నారు. అందరూ సమష్టిగా కృషి చేసి టీడీపీని విజయపథంలో నడిపించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈ ఫైలింగ్ చేయండి

తాడిపత్రిటౌన్, మార్చి 24

తాడిపత్రి ట్రెజరీ పరిధిలోని పెన్షనర్లు 2021-22 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇన్‌కంట్యాక్స్ ఈ ఫైలింగ్‌ను అపరాధ రుసుంతో చేయాలని పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు సత్యప్రసాద్ ఆదివారం తెలిపారు. 2021-22కు సంబంధించి కొందరు తమ ఆదాయపరిమితి టాక్స్ పరిధిలో లేదని ఫైలింగ్ చేయలేదన్నారు. దీంతో నోటీసులు వచ్చాయని, వారు ఈనెల 31లోపు అపరాధ రుసుంతో ఫైలింగ్ చేయాలని కోరారు.

తెలుగుదేశం గెలుపు తథ్యం

ఎమ్మెల్యే అభ్యర్థి కాలవ శ్రీనివాసులు



కాలవ శ్రీనివాసులు సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ మద్దతు సర్పంచ్, నాయకులు

రాయదుర్గంరూరల్, మార్చి 24: రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలుపు తథ్యమని మాజీ మంత్రి పొలిట్‌బ్యూరో సభ్యులు, తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కాలవ శ్రీనివాసులు అన్నారు. ఆదివారం మండలంలోని పులకుర్తి గ్రామంలో శంఖారావం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కురుబదొనప్పతోపాటు 95 కుటుంబాలు వైసీపీ నుంచి తెలుగుదేశం పార్టీలో చేరారు. వారికి కాలవ శ్రీనివాసులు కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం దుర్మార్గ పాలనతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని, ఈ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రం అభివృద్ధి బాటలో పయనించడం ఖాయమన్నారు. ప్రతిఒక్కరూ తెలుగుదేశం పార్టీకి మద్దతు ఇచ్చి చంద్రబాబునాయుడుని ముఖ్యమంత్రి చేసేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ హనుమంతరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జ్ మోహన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ పుష్పావతి, కన్వీనర్ హనుమంతు, ఎంపీటీసీలు గంగాధర, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా పట్టణంలోని 24వ వార్డులో మారెమ్మగుడి ఏరియాలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి సూపర్‌సిక్స్ పథకాలపై అవగాహన కల్పిస్తూ సైకిల్ గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా వైసీపీ పార్టీని వీడి 30 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరారు. వారికి కాలవ శ్రీనివాసులు పార్టీ కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. రంజాన్ మాసం సందర్భంగా ఇఫ్తార్‌విందులో పాల్గొన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు పసుపులేటి నాగరాజు, మాజీ కౌన్సిలర్లు టంకశాల హనుమంతు, కడ్డిపూడి మహబూబ్‌బాషా, పొరాళ్ల పురుషోత్తం, వార్డు ఇన్‌చార్జి కావలి రవి, నాయకులు బంగి శంకర్, సుమలత, బత్తాల రఘు, అశోక్ పాల్గొన్నారు.

టీడీపీ గెలుపునకు పనిచేస్తా

బొమ్మనహాళ్: రాయదుర్గం నియోజకవర్గంలో టీడీపీ గెలుపు కోసం తన వంతుగా పనిచేస్తానని బొమ్మనహాళ్ మండలం ఉంతకల్లు గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు సప్తగిరి సత్యనారాయణ కాలవ శ్రీనివాసులతో అన్నారు. వైసీపీలో కీలకంగా ఉన్న సప్తగిరి సత్యనారాయణ టీడీపీ అభ్యర్థి కాలవ శ్రీనివాసులును బళ్లారిలో కలిసి మద్దతు పలికారు. సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలుపు కోసం తన అనుచర వర్గంతో పనిచేస్తామన్నారు. కాలవ శ్రీనివాసులుకు అన్ని విధాలుగా సహకరిస్తానని వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొత్తపల్లి తిమ్మరాజు, ముల్లంగి నారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు.

జితేంద్రగౌడ్‌కు టిక్కెట్ కేటాయించాలి



మాట్లాడుతున్న యాదవ, కురుబ నాయకులు

గుత్తి, మార్చి 24: మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడ్‌కే ఎమ్మెల్యే టిక్కెట్ కేటాయించాలని యాదవ, కురుబ కులస్థులు డిమాండ్ చేశారు. స్థానిక అనంతపురం రోడ్డులోని ఓ ఫంక్షన్ హాల్‌లో వారి ఆధ్వర్యంలో ఆదివారం టీడీపీ నాయకులు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. టీడీపీ హయంలో నియోజకవర్గంలోని మూడు చెరువులకు నీటిని నింపి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టారన్నారు. పార్టీ అధికారంలో లేనప్పటికీ కార్యకర్తలు, నాయకులకు అండగా ఉంటున్నారన్నారు. పార్టీ కోసం పనిచేసిన ఆయనకు గుంతకల్లు టికెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మాజీ మార్కెట్ చైర్మన్ శ్రీనివాసయాదవ్, మాజీ సర్పంచులు లక్ష్మీనారాయణమ్మ, నరసింహులు, నారాయణస్వామి, మాజీ ఉప సర్పంచు నారప్పరెడ్డి, మాజీ మండల ఉపాధ్యక్షుడు ఓబులుదాస్, మాజీ ఎంపీటీసీలు వెంకటనారయణ, రంగారెడ్డి, పెద్దన్న, హరి, టౌన్ బ్యాంక్ డైరెక్టర్ కృష్ణ, నాయకులు సుధాకర్, యోగానంద రెడ్డి పాల్గొన్నారు.

పార్థసారథికి టిక్కెట్ ఇవ్వడంపై హర్షం



పార్థసారథిని సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

కణేకల్లు, మార్చి 24: హిందూపురం ఎంపీ అభ్యర్థిగా బీకే పార్థసారథిని ఎంపిక చేయడం పట్ల రాయదుర్గం మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్, టీడీపీ నాయకుడు ఎస్‌కే మల్లికార్జున హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం అనంతపురంలో పార్థసారథిని కలిసి పూలమాల వేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎం వెంకటేశ్, యువరాజ్, నితీష్, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రేణుకాచార్య జయంతి

ఉరవకొండ, మార్చి 24: పట్టణంలోని మల్లేశ్వరస్వామి దేవాలయ ఆవరణంలో జగద్గురు రేణుకాచార్య జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. అంతకుమునుపు మల్లేశ్వరస్వామికి అభిషేకాలు, పూజలను చేశారు. అనంతరం రేణుకాచార్య చిత్రపటానికి ప్రత్యేక పూజలను చేశారు. కార్యక్రమంలో జంగమ సంక్షేమ సంఘం నాయకులు బండయ్య, రాచప్ప, రుషీంద్ర, బసవరాజు, విజయ్‌కుమార్, రాజేష్, నటరాజ్ పాల్గొన్నారు.

నేడు సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం

తాడిపత్రిటౌన్, మార్చి 24: పట్టణంలోని రాఘవేంద్రస్వామి మఠంలో సోమవారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 10 గంటలకు వ్రతం ప్రారంభమవుతుందన్నారు.

టీడీపీ అధికారంలోకి రావాలి: అశ్మిత్‌రెడ్డి



వృద్ధురాలిని పలకరిస్తున్న అశ్మిత్‌రెడ్డి

తాడిపత్రిటౌన్, మార్చి 24: టీడీపీ అధికారంలోకి రావాలని ఎమ్మెల్యే అభ్యర్థి జేసీ అశ్మిత్‌రెడ్డి అన్నారు. బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగ ఆదివారం పట్టణంలోని పోరాటకాలనీలో పర్యటించారు. ఇంటింటికి తిరిగి మహిళలు, వృద్ధులు, చిన్నారులను ఆప్యాయంగా పలకరిస్తూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టీడీపీ మేనిఫెస్టోలోని అంశాలను వివరించారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి కదిరి శ్రీకాంత్‌రెడ్డి, కౌన్సిలర్ విజయ్‌కుమార్, కాంట్రాక్టర్ ప్రసాద్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, నరేంద్రనాయుడు, కార్తీక్, చింబిలి ప్రసాద్, రాము పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తులు

యాడికి, మార్చి 24: ఆదర్శపాఠశాలలో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మారుతి తెలిపారు. యాడికి ఆదర్శపాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్ మొదటి ఏడాది ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పించడంతోపాటు ఆంగ్ల మాధ్యమంలో ఉచితంగా విద్యాబోధన అందిస్తున్నట్లు తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. ఈనెల 28నుంచి మే22వరకు ఓసీ, బీసీ, ఈ డబ్ల్యుఎస్ విద్యార్థులు రూ.200, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.150 దరఖాస్తు రుసుం చెల్లించాలని తెలిపారు. మార్కుల మెరిట్ రిజర్వేషన్ రూల్స్ ప్రకారం ప్రవేశాలు కల్పించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

టీడీపీ గెలుపును ఎవరూ ఆపలేరు

బొమ్మనహాళ్, మార్చి 24: రాష్ట్రంలో టీడీపీ గెలుపును ఎవరూ ఆపలేరని టీడీపీ మండల కన్వీనర్ బలరాంరెడ్డి, బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు కేశప్ప అన్నారు. ఆదివారం మండలంలోని దర్గాహోన్నూరు, శ్రీధరఘట్ట, హరేసముద్రం తదితర గ్రామాలలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో మాజీ కో ఆప్షన్ మెంబర్ సర్మాస్‌వలి, ఆర్గనైజ్ సెక్రెటరీ నాగరాజు, మాజీ ఎంపీటీసీ ఆనంద్, మాజీ సర్పంచ్ పల్లి తిప్పేస్వామి, టీడీపీ నాయకులు వీఎల్ రామాంజినేయులు, రామస్వామి, ముక్కన్న, రఫీ, మొండి చెన్నప్ప, నాగప్ప తదితరులు పాల్గొన్నారు.

శ్రావణిశ్రీని గెలిపిద్దాం

పుట్లూరు, మార్చి 24: మండలంలోని సూరేపల్లి గ్రామంలో ఆదివారం టీడీపీ నాయకులు ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. టీడీపీ నాయకులు రామాంజనేయులు మాట్లాడుతూ.. బండారు శ్రావణిశ్రీని ఎమ్మెల్యేగా గెలిపిస్తే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రామానాయుడు పాల్గొన్నారు.

సూపర్‌సిక్స్ పథకాలతో అన్నివర్గాలకు లబ్ధి

కణేకల్లు, మార్చి 24: కణేకల్లు మండలంలోని గరుడచేడు గ్రామంలో ఆదివారం టీడీపీ నాయకులు సూపర్‌సిక్స్ పథకాలపై ప్రచారం చేశారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి మారుతి, యూనిట్ ఇన్‌చార్జి జయశీలారెడ్డి, జలంధర్‌రెడ్డి, మహేష్, నాగరాజు, మల్లి, కృష్ణ, రాము, సంతోష్ పాల్గొన్నారు.



గరుడచేడులో ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

టీడీపీలో చేరిక



పార్టీలోకి చేరిన వారితో జేసీపీఆర్

తాడిపత్రిటౌన్, మార్చి 24: పట్టణానికి చెందిన ప్యానల్‌బోర్డు మైనార్టీ నాయకుడు జిలాన్‌బాషా ఆదివారం టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. అదేవిధంగా పెద్దపప్పూరు మండలంలోని ధర్మాపురం గ్రామానికి చెందిన వైసీపీ మద్దతుదారులు శివయ్య, అశోక్‌లు కూడా టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి జేసీ ప్రభాకర్‌రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

భవనానికి మారిన రంగులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కూడేరు, మార్చి 24: మండల కేంద్రంలోని సచివాలయానికి వైసీపీ రంగులను తొలగించారు. కోడ్ కూసినా తొలగని రంగులు అన్న శీర్షికతో ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి స్పందించిన అధికారులు రంగులు మార్చారు.

జీడిపల్లి రిజర్వాయర్‌లో 0.396 టీఎంసీల నీటి నిల్వ

బెళుగుప్ప, మార్చి 24: మండలంలోని జీడిపల్లి రిజర్వాయరులో ప్రస్తుతం 0.396 టీఎంసీల నీటి నిల్వ వున్నట్లు ఆదివారం హంద్రీనీవా అధికారులు తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయరులో ఇన్‌ఫ్లో 0 క్యూసెక్కులు వస్తుండగా ఇక్కడి నుంచి ఫేజ్-2కు ఔట్‌ఫ్లో కింద 400 క్యూసెక్కులు వెళుతుందని అధికారులు తెలిపారు.

క్షయవ్యాధిని నిర్మూలిద్దాం

రాయదుర్గంరూరల్, మార్చి 24: క్షయవ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని టీబీ యూనిట్ మెడికల్ ఆఫీసర్ రమేష్ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏరియా ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్ మున్వర్, టీబీ యూనిట్ మెడికల్ ఆఫీసర్ ఎస్ రమేష్‌ల ఆధ్వర్యంలో జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఆసుపత్రి వద్ద నుంచి వినాయకసర్కిల్ వరకు ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ టీబీ ఓడిపోతుంది.. దేశం గెలుస్తుంది నినాదంతో క్షయవ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో టీబీ ల్యాబ్ సూపర్‌వైజర్ సత్యనారాయణ, శ్రీకాంత్‌నాయక్, సురేష్‌బాబు పాల్గొన్నారు.

బొమ్మనహాళ్: క్షయవ్యాధిని నిర్మూలించే బాధ్యత అందరిపై ఉందని బొమ్మనహాళ్ మండలం శ్రీధరఘట్ట వైద్యాధికారి గీతాభార్గవి అన్నారు. ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం మండలంలోని ఉద్దేహాళ్, లింగదహాళ్ గ్రామాలలో క్షయవ్యాధి నిర్మూలనకు సంబంధించిన ర్యాలీని వైద్యులు ప్రారంభించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్లు జైనాబీ, గోవర్ధన్, వెంకటరమణ పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్: క్షయ వ్యాధి మహమ్మారిని తరిమికొడదామని డాక్టర్ హర్షద్ అన్నారు. ఆదివారం అంతర్జాతీయ క్షయవ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నుంచి టీ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ, హెల్త్ అసిస్టెంట్ నర్సారెడ్డి, గంగరాజు, గోపాల్, బ్యాంక్ అడ్వయిజర్, విజయ్ కుమార్, ఎస్టీఎస్ శివకుమార్ పాల్గొన్నారు.

రంగులు తొలగించరా..?



యాడికి, మార్చి 24: మండలంలోని తిప్పారెడ్డిపల్లిలో మినరల్ వాటర్‌ప్లాంట్‌కు వైసీపీ రంగులు అలాగే ఉన్నాయి. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో పార్టీ రంగులు బహిరంగ ప్రదేశాల్లో ఉండకూడదని స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయి. పార్టీల రంగులను కనబడకుండా చర్యలు తీసుకోవాల్సిన అధికారులు మినరల్ వాటర్‌ప్లాంట్‌కు ఉన్న రంగులు తొలగించడంలో ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారో అని విమర్శలు వస్తున్నాయి. వెంటనే వైసీపీ రంగులు కనిపించకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పోలీసుల తనిఖీలు

గుంతకల్లు, మార్చి24: ఎన్నికల నేపథ్యంలో స్థానిక రైల్వే స్టేషన్‌లోని పార్సల్ కార్యాలయంలో వన్ టౌన్ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. వన్ టౌన్ సీఐ రామసుబ్బయ్య ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం పార్సల్ ఆఫీసులో నిల్వ ఉంచిన పార్సళ్లు, సంచులను పరిశీలించారు. ఎన్నికల సమయంలో నిబంధనలకు వ్యతిరేకంగా, అసాంఘిక శక్తులు అనుచితమైన సరుకులు రైల్వే ద్వారా రవాణా చేయకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పార్సల్ ఆఫీసు అధికారులకు సీఐ సూచనలిచ్చారు. కార్యక్రమంలో వన్ టౌన్ పోలీసులు పాల్గొన్నారు.

ముగిసిన ఉత్సవాలు

యల్లనూరు, మార్చి 24: మండలంలోని ఓబులేసుస్వామి ఉత్సవాలు ఆదివారం ముగిశాయి. మూడురోజులపాటు జరిగిన ఈ వేడుకల్లో భాగంగా చివరిరోజున స్వామివారి ఆలయానికి చేరుకున్న తర్వాత అమ్మవార్లకు ప్రత్యేక బోనాలు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దఎత్తున మహిళలు దీపాలు మోస్తు బోనాలు పెద్దమ్మతల్లికి సమర్పించారు. అనంతరం మొక్కుబడులు చెల్లించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్‌ఐ గిరిబాబు బందోబస్తు నిర్వహించారు.

నాగిరెడ్డిపల్లిలో పోలీసు పికెట్

బ్రహ్మసముద్రం, మార్చి 24: నాగిరెడ్డిపల్లిలో సార్వత్రిక ఎన్నికల దృష్టిలో వుంచుకుని పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు. ఎస్పీ ఆదేశాల మేరకు బ్రహ్మసముద్రం ఎస్‌ఐ పరశురాముడు ఆధ్వర్యంలో పోలీసు పికెట్ ఏర్పాటు చేసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ముందస్తు చర్యలు చేపట్టారు.

రక్తదాన శిబిరం

గుత్తి, మార్చి 24: సినీనటుడు రాంచరణ్ జన్మదినం సందర్భంగా అఖిల భారత చిరంజీవి యువత, రాష్ట్ర రామ్‌చరణ్ యువశక్తి ఆధ్వర్యంలో స్థానిక పాత మున్సిపల్ కార్యాలయంలో ఆదివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రామ్‌చరణ్ అభిమానులు 60మంది రక్తదానం చేసి తన అభిమానాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు పాటిల్ సురేష్, బోయగడ్డ బ్రహ్మయ్య, నరేష్, పతి, అల్లుఅర్జున్ హరి, కృష్ణ, ఓబులేశు, షేక్షావలి పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

బ్రహ్మసముద్రం, మార్చి 24: వేదావతి, హగరి నుంచి ఆదివారం ఉదయం ఇసుకను అక్రమంగా తరలిస్తున్న అధికార పార్టీ నాయకులకు చెందిన మూడు ట్రాక్టర్లును పోలేపల్లి చెక్‌పోస్టు సమీపంలోని పోలీసు సిబ్బంది పట్టుకున్నారు. ఎస్‌ఐ పరశురాముడు కేసు నమోదు చేసి ట్రాక్టర్లను తహసీల్దార్ ఈశ్వరయ్యకు అప్పగించారు. తహసీల్దార్ వాటిని సీజ్ చేస్తున్నట్లు తెలిపారు.

డిఫెన్స్ అకాడమీకి ఎంపిక

రాయదుర్గంరూరల్, మార్చి 24: పట్టణంలోని జూనియర్ కళాశాలలో మొదటి, ద్వితీయ సంవత్సరం చదువుతున్న 12 మంది విద్యార్థులు డిఫెన్స్ అకాడమీకి సెలెక్ట్ అయినట్లు కళాశాల ప్రిన్సిపాల్ వీరేష్ తెలిపారు. ఆదివారం అనంతపురానికి చెందిన డిఫెన్స్ అకాడమి కోచింగ్ సెంటర్ నిర్వహించిన ఫిజికల్ ఫిట్‌నెస్‌లో 12 మంది విద్యార్థులు అర్హత సాధించినట్లు వివరించారు. సీఆర్‌పీఎఫ్, బీఎస్‌ఎఫ్, మిలటరీ, నేవీ, ఆర్‌పీఎఫ్ లాంటి ఉద్యోగాలకు సెలెక్ట్ అయినట్లు తెలిపారు.

'కఠిన చర్యలు తీసుకోండి'

రాయదుర్గంరూరల్, మార్చి 24: చేనేత కుటుంబం మరణానికి వైసీపీ భూకబ్జాదారులు బాధ్యత వహించాలని చేనేత కుర్ని రాష్ట్ర అధ్యక్షుడు టంకశాల హనుమంతు పేర్కొన్నారు. ఆదివారం టీడీపీ కార్యాలయం కొవ్వొత్తులతో శాంతిర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ నాయకులపై కఠినచర్యలు తీసుకోవాలన్నారు. శాంతిర్యాలీలో పట్టణ అధ్యక్షుడు పసుపులేటి నాగరాజు, మాజీ కౌన్సిలర్ పొరాళ పురుషోత్తం, టీడీపీ నాయకులు తిప్పయ్య, శ్రీరాములు, ఇనాయత్, వెంకటేశులు, ప్రహ్లాద, సత్తి తదితరులు పాల్గొన్నారు.

టీ కేఫ్‌లో ఎమ్మెల్యే

ఉరవకొండ,మార్చి24: రాజకీయాల్లో బిజీబిజీగా ఉండే ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ టీ కేఫ్‌లో టీ తాగుతూ కార్యకర్తలతో సరదాగా కాలక్షేపం చేశారు. బళ్లారిలో ఓ వివాహ కార్యక్రమానికి హాజరై కౌకుంట్లకు వెళ్తూ ఆదివారం బైపాస్‌లోని టీ కేఫ్ వద్ద ఆగి టీ తాగారు. ఎమ్మెల్యే వెంట మాజీ సర్పంచు గోవిందు, నారాయణస్వామి ఉన్నారు.



లౌకికవాదాన్ని కాపాడుకుందాం

గుంతకల్లుటౌన్, మార్చి 24: లౌకికవాదాన్ని కాపాడుకుందామని సీఐటీయూ పట్టణ అధ్యక్షుడు కసాపురం రమేష్, సీపీఎం నాయకుడు మారుతిప్రసాద్ పిలుపునిచ్చారు. స్థానిక సీఐటీయూ కాలనీలో ఆదివారం భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్రిటిష్ సామ్రాజ్యవాదుల నుంచి భారతదేశాన్ని విముక్తి చేయడానికి విద్యార్థుల్ని, యువకుల్ని పెద్ద ఎత్తున ఉద్యమాల్లోకి తీసుకురావడంలో భగత్‌సింగ్ కీలక పాత్ర వహించారన్నారు. యువత భగత్‌సింగ్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

యువకుడి ఆత్మహత్య

తాడిపత్రిటౌన్, మార్చి 24: మండలంలోని గంగాదేవిపల్లి గ్రామానికి చెందిన నాగరాజు (23) ఆదివారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు. గ్రామానికి చెందిన పెద్దనాగన్న, పార్వతి దంపతుల కుమారుడు నాగరాజు. డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగించేవాడు. కొంతకాలం క్రితం నాగరాజుకు నంద్యాలకు చెందిన యువతితో నిశ్చితార్థం జరిగింది. కొన్ని కారణాల వల్ల పెళ్లి రద్దుకావడంతో నాగరాజు ఆదివారం ఇంటిలో ఎవరూలేని సమయంలో ఉరివేసుకొన్నాడు. తండ్రి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ మల్లికార్జున తెలిపారు.

వాహనాల తనిఖీ

తాడిపత్రిటౌన్, మార్చి 24: పట్టణంలోని యల్లనూరురోడ్డు శి వారులో ఆదివారం ఎస్‌ఐ గౌస్‌బాషా వాహనాల తనిఖీ నిర్వహించా రు. ఎన్నికల కోడ్ అమలులో ఉం డడంతో డబ్బులు, మద్యం తరలిస్తున్నారా..? అన్న అనుమానంతో వా హనాలను తనిఖీ చేశామని ఎస్‌ఐ తెలిపారు.

అల్లీపీరాస్వామిని దర్శించుకున్న ధర్మతేజ



కళ్యాణదుర్గం, మార్చి 24: టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు అల్లుడు దేవినేని ధర్మతేజ అల్లీపీరాస్వామిని దర్శించుకున్నారు. ఆదివారం గుడికల్లు అల్లీపీరాస్వామిని దర్శించుకుని ఆశీస్సులు తీసుకున్నారు. చెలికెర పట్టణానికి అల్లీపీరాస్వామి రాగా ధర్మతేజ అక్కడికి వెళ్లి ఆశీస్సులు తీసుకున్నారు.